J/NELLORE/003/21-23 R.N.I.No.25359/74 పేజీలు : 12




THE BEST TELUGU WEEKLY OF NELLOREANS

# లాయర్

సంపుటి : 40 సంచిక : 46 16.4.2021, శుక్రవారం వెల : రూ. 5 /- వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంపాదకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

## ఓట్ల కోసం ఒకరు.. నోట్ల కోసం మరొకరు..

# కోడ్ లేదు.. కోవిడ్ లేదు.. అంతా స్వార్థమే

### ➤ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న పార్టీలు ➤ కాసుల కోసం ఎగబడుతున్న జనాలు

*రోజూ టీవీలలో వార్తాపత్రికలలో ఓ వైపు .....*

*భారతదేశంలో మళ్లీ కోరలుచాచిన కరోనా. రోజుకు సుమారు రెండు లక్షల మందికి పైగా కోవిడ్ బారిన పడుతున్న ప్రజలు. మొదటి సారికన్నా తీవ్రంగా ఉన్న రెండవ వేవ్. ప్రాణాలు కోల్పోతున్న ప్రజలు, గుట్టలు గుట్టలుగా శవాలు. కొన్ని రాష్ట్రాల్లో రాత్రిపూట కర్ఫ్యూ. కొన్ని రాష్ట్రాల్లో పాక్షికంగా లాక్‌డౌన్. జనతా కర్ఫ్యూ దిశగా మరికొన్ని రాష్ట్రాలు. గతంకన్నా ప్రమాదకరమంటున్న డాక్టర్లు. పరిస్థితి అదుపు తప్పుతోందంటున్న వైద్య శాస్త్రవేత్తలు.*

*అదే వార్తా మాధ్యమాలలో మరో వైపు....*

*ఆంధ్రాలో తిరుపతి ఉప ఎన్నికలో నాయకుల ప్రచార జోరు. వైసిపి మెజారిటీ కోసం మంత్రులు, యంయల్‌ఏలు, పార్టీ శ్రేణుల ప్రచారం. తెలుగుదేశం గెలుపు కోసం వందిమాగదులతో కలసి పెదబాబు, చినబాబు రోడ్డు షోలు. భాజాపా ఉనికి కోసం రాష్ట్ర, జాతీయ నేతల భారీ సభలు. తాము కూడా ఉన్నామంటూ కాంగ్రెస్‌పార్టీ పాదయాత్రలు. తెలంగాణలో నాగార్జునసాగర్ ఉప ఎన్నిక ప్రచారం కోసం లక్షమందితో కేసిఆర్ సభ. కలకత్తాలో నువ్వా నేనా అన్నట్లుగా ప్రధాన పార్టీల ప్రచార ఆర్భాటం. మహారాష్ట్ర, కొత్తఢిల్లీలతోపాటు దేశంలోని ఇతర అన్ని రాష్ట్రాలలో రోజురోజుకీ అంతకంతకూ పెరుగుతున్న కరోనా ద్వితీయ శ్రేణి కేసులు...*

ఇవన్నీ చూస్తుంటే.. గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. రోజు రోజుకి ఆసుపత్రులలో నిండుతున్న బెడ్లు చూస్తుంటే వొళ్ళంతా చెమటలు పడుతున్నాయి. స్మశాన వాటికల ముందు లైన్లు కడుతున్న శవాలను తల్చుకుంటే పైప్రాణాలు పైనేపోతున్నాయి. కానీ ప్రస్తుతం సార్వత్రిక ఎన్నికలు, ఉప ఎన్నికలు జరుగుతున్న ప్రాంతాలలో మాత్రం అటు ఓట్లకోసం గాలమేస్తున్న రాజకీయ పార్టీలకు, ఇటు నోట్ల కోసం ఎగబడుతున్న సామాన్య ప్రజలకు చీమకుట్టినట్లు కూడా లేదు. కరోనా వచ్చి మీరు చచ్చినా ఫరవాలేదు మా పార్టీకి ఓట్లేసి గెలిపించండంటూ అభ్యర్థిస్తున్న రాజకీయ పార్టీలనూ, మా ప్రాణాలు పోయినా పరవాలేదు మాకు సొమ్ము, సారా ఇస్తే చాలంటూ సిగ్గులేకుండా ఎగబడుతున్న ఓటర్ల పోకడను చూస్తుంటే జుగుప్స కలుగుతోంది. ఎన్నికల వ్యవస్థ తీరుపైనే అసహ్యం వేస్తోంది.

## ప్రజారోగ్యం పట్టదా?

దేశంలో కరోనా రెండవ దశ విలయతాండవం చేస్తోంది. ఈ దశలో నాయకులూ అధికారులు కూడా స్కూళ్ళు, దేవుడి గుళ్ళు, సినిమా హాళ్ళూ, నైట్ క్లబ్బులూ, బార్లు రెస్టారెంట్ల గురించే మాట్లాడుతున్నారు తప్ప, లక్షలాది మంది జనాన్ని రోడ్లపైన నిలబెడుతున్న రాజకీయ సభల గురించి ఒక్కరు కూడా నోరు మెదపడం లేదు. దేశంలోని కొన్ని రాష్ట్రాలలో ఇటీవల సాధారణ ఎన్నికలు జరిగాయి. వీటితో పాటు మరికొన్ని ప్రాంతాలలో ఏప్రిల్ 17న ఆ తరువాత ఉపఎన్నికలు కూడా జరగనున్నాయి. ఇదే తరుణంలో దేశంలో కరోనా కరుణ లేకుండా దూసుకుపోతోంది. జన సంక్షేమమే తమ ధ్యేయమని ఉపన్యాసాలలో ఊదరగొట్టే రాజకీయ పార్టీలు, ఆయా పార్టీల నాయకులూ ప్రజల ఆరోగ్యాలను మాత్రం గాలికి వదిలేశారు. తమ ఇష్టానుసారం

10లో






# ఉద్యోగుల సమస్యలు తీర్చేందుకు కృషి చేస్తా

**— ప్రభుత్వోద్యోగుల సమాఖ్య ఛైర్మన్ వెంకటరామిరెడ్డి**

పంచాయతీరాజ్ శాఖ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వానికి తెలియజేసి పరిష్కరించేందుకు కృషిచేస్తానని ఏపీ గవర్నమెంట్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ఛైర్మన్ కె.వెంకటరామిరెడ్డి చెప్పారు. ఈనెల12న నెల్లూరుకు వచ్చిన ఆయన్ని జిల్లా పంచాయతీరాజ్ ఉద్యోగులు కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంపీడీఓలు, మినిస్టీరియల్ ఉద్యోగుల పదోన్నతులు తదితర సమస్యలను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళుతామన్నారు. ఎంపీడీఓలకు పదోన్నతులు కల్పించడం ద్వారా పంచాయతీరాజ్ శాఖలో 1500 మందికి ప్రమోషన్లు వస్తాయన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థ ద్వారా 1.30 లక్షల మందికి ఉద్యోగాలు కల్పించారని, సచివాలయ ఉద్యోగులు సీఎంకు రుణపడి ఉన్నారన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ ఉద్యోగులు, మార్కెట్ కమిటీ ఉద్యోగులకు వేతనాలు చెల్లించేందుకు సీఎం సానుకూలంగా ఉన్నారన్నారు. రాష్ట్ర ఎంపీడీఓల సంఘం అధ్యక్షుడు బ్రహ్మయ్య, జిల్లా ఎంపీడీఓల సంఘం అధ్యక్షుడు శివయ్య, ఈఓపీఆర్డీల సంఘం అధ్యక్షుడు విజయ్‌కుమార్, జిల్లా పంచాయతీ రాజ్ ఉద్యోగుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు గంగవరపు శ్రీధర్, చౌదరి, ఉపాధ్యక్షుడు అశోక్, కృష్ణమూర్తి, ప్రసాద్ పాల్గొన్నారు.

# పూర్వ విద్యార్థుల సమ్మేళనం



ఇందుకూరు పేటలోని ఎంకెఆర్ ఉన్నత పాఠశాలలో 1991లో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు ఈనెల 10న సమావేశమై తాము ఆ బడిలో చదువుకున్నప్పటి జ్ఞాపకాలను గుర్తుచేసుకుని ఆనందించారు. అందరూ ఎంతో ఆత్మీయంగా మాట్లాడుకున్నారు. యోగక్షేమాలను ఒకరికొకరు తెలుసుకుంటూ సంతోషించారు. అనంతరం ఉపాధ్యాయులను సత్కరించారు. విద్యార్థులకు జ్ఞాపికలను అందజేశారు. తాము చదువుకున్న ఈ పాఠశాల అభివృద్ధికి తమవంతు కృషి చేస్తామన్నారు. పూర్వ విద్యార్థులు ఖుద్దూస్, శరత్‌కుమార్‌రెడ్డి, శ్రీరామ్, నవీన్, సూరి, సుధాకర్, మొయినుద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

# బుచ్చిలో వేడుకగా పోలేరమ్మ జాతర

బుచ్చిరెడ్డిపాళెంలోని కనిగిరి రిజర్వాయర్ వద్ద ఉన్న దుర్గామల్లేశ్వరి బ్రహ్మపీఠంలో ఉగాది సందర్భంగా ఈనెల 13న పోలేరమ్మ అమ్మవారికి వేడుకగా జాతర నిర్వహించారు. బుచ్చిలోని రాఘవరెడ్డి కాలనీ వద్ద నుంచి భక్తులు పోలేరమ్మకు పుట్టింటి సంప్రదాయంగా పసుపు కుంకుమ, చీరసారెలతో వచ్చి అమ్మవారికి సమర్పించారు. పెద్దఎత్తున భక్తులు పాల్గొని అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు.

# అకాల వర్షాలు కురుస్తాయి

**---------- వాతావరణశాఖ చల్లని కబురు**

ఈ వేసవిలో మండుతున్న ఎండల సెగకి, వడగాలులకి తట్టుకోలేక అవస్థలు పడుతున్న ప్రజానీకానికి వాతావరణ శాఖ చల్లని కబురందిస్తోంది. ఇటీవల బంగాళాఖాతంలో వాయు గుండం ఏర్పడినందువల్ల వాతావరణం చల్లబడి వర్షాలు కురిసే అవకాశం ఉందంటున్నారు వాతావరణ శాఖ నిపుణులు. నైరుతి రుతుపవనాల రాకకు ఇది సంకేతంగా కూడా ఉండవచ్చని వారు భావిస్తున్నారు. వాయుగుండం ప్రభావంతో ఈనెల 16 నుంచి రాష్ట్రంలోని పలు జిల్లాల్లో అకాల వర్షాలు కురుస్తాయని, తొలుత కర్నూలులో వర్షాలు ప్రారంభమై ఆ తర్వాత మిగిలిన జిల్లాల్లో కూడా వర్షాలు కురుస్తాయని, సుమారు వారం రోజుల దాకా అంటే ఈ నెల 22 దాకా వానలు కురవవచ్చని అంచనా వేస్తున్నారు. వారు చెప్పినట్లుగానే గత రెండు రోజులుగా వాన వాతావరణం కనిపిస్తోంది. ఈనెల 14న రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల్లో భారీవానలు కూడా కురిశాయి. ప్రకాశం, చిత్తూరు, తూర్పుగోదావరి జిల్లాల్లో ఈ వర్షాలతో పంటలకు కూడా నష్టం కలిగింది. అకాలమో సకాలమో తర్వాత సంగతి, ముందు కాస్తంత చల్లని వాతావరణం ఉంటే చాలు అనుకుంటున్నారు ఈ ఎండల దెబ్బకి నెల్లూరు జనం. గురువారం నాలుగు చినుకులు పడడంతో నగరంలో ప్రజలు హాయిగా ఊపిరి పీల్చుకున్నారు. అయితే, రాబోయే అకాల వర్షాల వల్ల జనానికి, రైతులకి కొత్త ఇబ్బందులు రాకుండా ఉంటే చాలు.. అదే పదివేలు.

# ఈత సరదా ప్రాణం తీసింది..

**బావిలో దూకి బాలుని దుర్మరణం**

సరదాగా ఈతకొట్టేందుకు బావిలోకి దూకిన ఓ బాలుడు ప్రమాదవశాత్తూ నీటమునిగి చనిపోయాడు. పెళ్ళకూరు మండలంలోని శిరసనంబేడు రాజుపాళెంలో జరిగిన ఈ ఘటనతో ఆ బాలుని తల్లిదండ్రులు పెద్దపెట్టున రోదిస్తున్నారు. నాయుడుపేటకు చెందిన గుంటూరు యశ్వంత్ ఈనెల 13వతేది మధ్యాహ్నం స్నేహితులతో కలసి శిరసనంబేడు రాజుపాళెంలో ఉన్న వ్యవసాయ బావిలోకి దూకాడు. అయితే బావిలో లోతు ఎక్కువగా ఉండడం, యశ్వంత్‌కు సరిగా ఈత రాకపోవడంతో నీళ్లలో మునిగి మృతి చెందినట్లు చెప్తున్నారు. స్నేహితులు వెంటనే అగ్నిమాపక దళానికి, పోలీసులకు సమాచారం అందించడంతో వారు వచ్చి యశ్వంత్‌ను బయటకుతీసి ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందాడని వారు తెలిపారు. తల్లిదండ్రులైన హరి, నాగలక్ష్మి ఈ ఘటనతో తల్లడిల్లిపోయారు. తమ ఏకైక సంతానమైన యశ్వంత్ అకాల మృతితో వారి రోదన హృదయవిదారకంగా ఉంది.

ధాన్యం తెచ్చినా..

# అధికారులు కొనడం లేదు

**కొనుగోలు కేంద్రం వద్ద రైతుల ఆందోళన**

రైతులకు మద్దతు ధరను ప్రభుత్వం నిర్ణయించినా, రైతుల నుంచి ఎంత ధాన్యం ఉన్నా కొనుగోలు చేస్తామని జిల్లా ఉన్నతాధికారులు చెప్తున్నా కొనుగోలు కేంద్రం వద్ద ఉన్న అధికారులు మాత్రం రైతుల నుంచి ధాన్యం కొనడం లేదంటూ ఈనెల 12న సంగంలోని ధాన్యం కొనుగోలు వద్ద ఆ ప్రాంతంలోని అనేకమంది రైతులు ఆందోళన చేశారు. ఎంతో కష్టపడి రైతులు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల వద్దకు తీసుకువస్తే అధికార యంత్రాంగం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ధాన్యం విరుగుడు వస్తున్నాయంటూ అధికారులు ధాన్యాన్ని కొనుగోలు చేయడం లేదని, కొనుగోలు కేంద్రం వద్దకు ధాన్యం తీసుకువచ్చి మూడు రోజులవుతున్నా సంబంధిత అధికారులు తమవైపు కన్నెత్తి కూడా చూడడం లేదని, జిల్లా ఉన్నతాధికారులు వెంటనే తమ దుస్థితిని పరిశీలించి ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరారు. ఆందోళన అనంతరం వారు తమకు న్యాయం చేయాలంటూ ప్రభుత్వాన్ని కోరుతూ తహశీల్దారుకు వినతిపత్రం సమర్పించుకున్నారు.

కామాక్షితాయి సన్నిధిలో

# విద్యారణ్య భారతి స్వామీజీ

హంపి విరూపాక్ష విద్యారణ్య మహాసంస్థానానికి చెందిన సద్గురు విద్యారణ్య భారతి స్వామీజీ ఈనెల 13న జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన జొన్నవాడకు వచ్చి శ్రీ కామాక్షితాయి అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఆయనకు ఘనస్వాగతం పలికారు. ఆలయ ఛైర్మన్ చీమల రమేష్‌బాబు, ఇ.ఓ ఏవి శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.



ఉగాది సందర్భంగా శ్రీ కాళహస్తీశ్వర దేవస్థానంలో ఈ నెల 13న సహస్రావధాని డా.మేడసాని మోహన్ అధ్యక్షతన జరిగిన కవిసమ్మేళనంలో పాల్గొన్న నెల్లూరు కవులు డా.గంగిశెట్టి శివకుమార్, బొగ్గరపు రాధాకృష్ణమూర్తి


7వ వర్ధంతి



మానవత్వానికి ప్రతిరూపంలా నిలిచారు, దాతృత్వంతో అందరి మనసులు గెలిచారు,
శ్రమించే తత్వానికి ప్రతిబింబం మీరు... మంచిని పంచే వ్యక్తిత్వానికి పెట్టింది మీ పేరు.
మా ఉన్నతికి బాటలువేసి, మా బంగారు భవిష్యత్‌కు మార్గదర్శకులుగా నిలిచిన మా ఇంటి దైవం

కీ॥శే॥ చెరుకుపల్లి పిచ్చిరెడ్డి గారు

అధినేత: సిపిఆర్ కళ్యాణ మండపం, శివప్రియ లాడ్జి

పరమపదించి తేది.18.04.2021 నాటికి ఏడేళ్ళు గడుస్తాయి.

వారి దివ్యస్మృతికి మా నివాళులు.

భార్య: సుబ్బరత్నమ్మ

కుమారుడు - కోడలు: చెరుకుపల్లి పద్మనారాయణరెడ్డి - సుమతి

మనుమలు: హరీశ్వర్‌రెడ్డి - సుస్మిత భువనేశ్వర్‌రెడ్డి

మరియు బంధుమిత్రులు



బోధనా పద్ధతులను

# మెరుగుపరచాలి

**- విఎస్‌యు వీసీ సుదర్శనరావు**

విశ్వవిద్యాలయాల్లో బోధనా పద్ధతులను మెరుగుపరచేందుకు రాష్ట్ర ప్రభుత్వం తగు చర్యలు తీసుకుంటోందని, ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్ల ఖాళీలను త్వరలో భర్తీచేసేందుకు కృషి జరుగుతోందని విఎస్‌యు వీసీ ఆచార్య సుదర్శనరావు తెలిపారు. ఈనెల 12న విఎస్‌యులో అధ్యాపకుల నియామకాలకు సంబంధించి అంతర్గత హేతుబద్ధీకరణ కమిటీతో, విభాగాధిపతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర హయ్యర్ ఎడ్యుకేషన్ కౌన్సిల్ మార్గదర్శకాలకు అనుగుణంగా వివిధ విభాగాల అధిపతులు అధ్యాపకుల ఖాళీల సమాచారాన్ని అంతర్గత హేతుబద్ధీకరణ కమిటీకి సమర్పించాలన్నారు. ఈ కమిటీలో విఎస్‌యు రిజిస్ట్రార్ ఎల్‌వి కృష్ణారెడ్డి, ఆచార్య విజయానంద్‌బాబు, సుజా ఎస్ నాయర్, అందే ప్రసాద్‌లను నియమించినట్లు తెలిపారు. రెక్టార్ ఎం. చంద్రయ్య, అధ్యాపకులు పాల్గొన్నారు.

# దండమయా.. శ్రీరామా !




**- వనం సుబ్రహ్మణ్యం**
94415 94897

కం: రాముని చరితము తెలియని
గ్రామము వెదకిన జగమున కాంచన్ గలమా
భూమాత పుత్రిక సీ
తా మాతా ఎరుగని వారు ధరణిని గలరే!

సీ: అల అయోధ్యాపురి నావిర్భవించి, ఆ
గాధేయు సవనంబు గాచినావు
శాపమ్ము పోగొట్టి చాపమ్ము వేర్దుంచి
సీతను పెండ్లాడి జేరి పురము!..
కైక వరంబుచే కానకు వేగొచ్చి
జానకి జాడను జగతి వెదకి
ఆంజనేయుని తోడ ఆ సాగరమును దాటి
రావణు వధియించి రాణకెక్కి!...
అతులితంబగు నానంద మతిశయింప
సీత గొని అయోధ్యాపురి జేరినావు
పరమపావని పాదములు పట్టుచుండ
రాజ్యమేలితివయ్య ఓ రామచంద్ర!..

కం : దండము శ్రీరామ కో
దండము చేగొని దనుజుల
దండించుచు మీ దండన్ చరించువారల
నిండగు ప్రేమన్ గనుమిక నిరతము రామా!..

# అందరూ భగవద్భక్తితో జీవించాలి



## - శ్రీ విద్యారణ్య భారతి స్వామీజీ ఉద్బోధ

- బెజవాడ ప్రసన్నరెడ్డి వ్యవసాయక్షేత్రంలో పూజలు
- కొత్తూరులోని షిర్డీసాయి, యోగాంజనేయస్వామి ఆలయాలను సందర్శించిన స్వామీజీ

ప్రతిఒక్కరూ భగవద్భక్తితో జీవించాలని, ఎంతో విశిష్టమైన మన ఆచారాలను సంప్రదాయాలను గౌరవించాలని హంపి పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ జగద్గురు శంకరాచార్య శ్రీ హంపి విరూపాక్ష విద్యారణ్య మహా సంస్థానానికి చెందిన శ్రీ విద్యారణ్య భారతి స్వామీజీ ఉద్బోధించారు. ఈనెల 13న ఉగాది పండుగ సందర్భంగా కొండ్లపూడి సమీపంలోని దేవరపాళెం వ్యవసాయ క్షేత్రాన్ని, ఆ తర్వాత కొత్తూరులోని శ్రీ షిర్డీసాయి, శ్రీ యోగాంజనేయస్వామి దేవాలయాలను స్వామీజీ సందర్శించారు. ఈ సందర్భంగా స్వామీజీ మాట్లాడుతూ పెద్దలు తమ పిల్లలకు సంస్కారాన్ని ఆస్తిగా ఇవ్వాలని, భగవద్భక్తిని వారికి బోధించి వారు సన్మార్గంలో నడిచేలా బాటలు వేయాలని చెప్పారు.

### దేవరపాళెంలో పూజలు, హోమాలు :



తొలుత దేవరపాళెంలో ధార్మిక సేవాతత్పరుడైన బెజవాడ ఫణిరాజ ప్రసన్నరెడ్డికి చెందిన వ్యవసాయ క్షేత్రంలో స్వామీజీ ప్రత్యేకపూజలు, హోమాలు చేసి వారి కుటుంబసభ్యులను ఆశీర్వదించారు. ప్రసన్నరెడ్డి కుటుంబానికి కులదేవతగా ఎంతో కాలం నుంచి పూజలందుకుంటున్న నాగదేవత అమ్మవారిని ఇక్కడ ప్రతిష్టించి 80 వసంతాలు గడిచిన సందర్భంగా శ్రీ విద్యారణ్య భారతి స్వామీజీ ప్రసన్నరెడ్డి–పద్మ దంపతులను, వారి కుటుంబ సభ్యులను, భక్తులను అందరినీ ఆశీర్వదించారు. శ్రీ విద్యారణ్య భారతి స్వామీజీ ఈ ప్రాంతానికి విచ్చేయడంతో ఈ ప్రాంతంలోని భక్తులంతా ఎంతో ఆనందించి స్వామీజీని దర్శించుకున్నారు. అనంతరం అక్కడి నుంచి స్వామీజీ జొన్నవాడకు వెళ్ళి మల్లికార్జున స్వామి సమేత శ్రీ కామాక్షితాయి అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు.

### కొత్తూరు ఆలయాలను దర్శించుకున్న స్వామీజీ :



ఆ తర్వాత ఇందుకూరుపేట మండలంలోని కొత్తూరు గ్రామంలో ఎంతో అద్భుతంగా నిర్మించిన శ్రీ షిర్డీ సాయి, శ్రీ యోగాంజనేయస్వామి దేవాలయాలను స్వామీజీ సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్మాణ ప్రదాతలు, దాతలు అయిన కలికి కోదండ రామిరెడ్డి–శ్రీలత దంపతులను స్వామీజీ అనుగ్రహించి ఆశీర్వదించారు. ఇక్కడకు వచ్చిన భక్తులకు అనుగ్రహభాషణం చేసి అందరికీ తన ఆశీస్సులను అందజేశారు. ఉగాది ప్రాశస్త్యాన్ని, రామాయణం వైశిష్ట్యాన్ని వివరిస్తూ అనేక ఆధ్యాత్మిక అంశాలను భక్తులకు వివరించి శ్రీ విద్యారణ్య స్వామీజీ స్థానిక ప్రజలందరినీ భక్తిభావ సమన్వితులను చేశారు.

# వలంటీర్ల వ్యవస్థను దుర్వినియోగం చేస్తున్నారు

## - కోటంరెడ్డి శీనయ్య, సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డిల ఫిర్యాదు



ఎన్నికల కమిషన్ ఎన్ని నిబంధనలు విధించినా అధికారులు అమలు చేయలేకపోతున్నారని, వైకాపా కరపత్రాలు పంచుతూ దొరికిన వలంటీర్లపై అధికారులకు ఫిర్యాదు చేసినా చర్యల్లేవని నెల్లూరు నగర టీడీపీ ఇన్‌చార్జి కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, సర్వేపల్లి సమన్వయకర్త సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ఆరోపించారు.

ఈనెల 15న గురువారం నాడు వెంకటాచలంలో సర్వేపల్లి నియోజకవర్గ ఏఆర్వో దినేష్‌కుమార్‌ని కలసి ఆమేరకు వారు ఫిర్యాదు కూడా చేశారు. నిబంధనలను ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకోకుండా అభ్యంతరాలు తెలిపిన వారిపైనే పోలీసులు కేసులు పెడుతున్నారని వారు పేర్కొన్నారు. సమస్యాత్మక ప్రాంతాల్లో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవడంతో పాటు నిబంధనలకు విరుద్ధంగా ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్న వలంటీర్లను కట్టడి చేయాలని వారు ఆ వినతి పత్రంలో పేర్కొన్నారు. సమస్యాత్మక గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని కోరారు. ఓటమి భయంతో వైసీపీ నాయకులు విచ్చలవిడిగా నగదు పంపిణీ చేస్తున్నారని వారు ఆరోపించారు. వైసీపీ కార్యకర్తల్లా వ్యవహరిస్తున్న వలంటీర్లను కట్టడి చేయందే ఎన్నికలు నిష్పక్షపాతంగా జరిగే పరిస్థితి లేదని వారు పేర్కొన్నారు. తాము చెప్పిన సమస్యలన్నింటినీ పరిశీలించి పరిష్కరిచేందుకు ఏఆర్వో సానుకూలంగా స్పందించారని వారు ఈ సందర్భంగా పేర్కొన్నారు. కరోనా సెకండ్ వేవ్ తీవ్రంగా ఉన్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ తగిన జాగ్రత్తలు తీసుకుని ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని వారు ఓటర్లకు విజ్ఞప్తి చేశారు.

## • దొడ్ల వారి దాతృత్వం

# జయభారత్ ఆసుపత్రికి 50 లక్షల విరాళం



చెన్నైకి చెందిన దొడ్ల రుక్మిణమ్మ, వరదారెడ్డి చారిటబుల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ దొడ్ల రఘునాధరెడ్డి ఇటీవల నెల్లూరులోని జయభారత్ ఆసుపత్రికి 50 లక్షల రూపాయల విరాళం అందజేసి తమ దాతృత్వాన్ని చాటుకున్నారు. గతంలో కూడా సమాజోపయోగానికి ఎన్నో భూరి విరాళాలను ఈ ట్రస్ట్ ద్వారా దాతలు అందించి ఉన్నారు. ఈ నేపథ్యంలో ఇటీవల నెల్లూరు నగరంలోని జయభారత్ ఆసుపత్రి ఆధ్వర్యంలో నడుస్తున్న నర్సింగ్ కళాశాల భవన నిర్మాణానికి వారు 50 లక్షల రూపాయలను విరాళంగా అందజేసి తమ సేవాభావాన్ని, దానగుణాన్ని చాటుకున్నారు. సింహపురి వైద్యసేవా సమితి ట్రస్ట్ ఛైర్మన్ పొన్నలూరు సీతారామిరెడ్డికి ఆ విరాళం చెక్కును అందజేశారు. గతంలోనూ జయభారత్ ఆసుపత్రిలో వైద్య పరికరాల కోసం కోటి రూపాయలకు పైగానే వీరు విరాళం అందజేసివున్నారని ఈ సందర్భంగా ఆసుపత్రి నిర్వాహకులు చెప్పారు. ఆ దాతల వదాన్యతను జిల్లా ప్రజలు ప్రశంసిస్తున్నారు కూడా. ఈ కార్యక్రమంలో సభ్యులు కృష్ణారెడ్డి, సుధాకర్, ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ శివమౌర్యగుప్తా, జనరల్ మేనేజర్ గురుప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


## బుచ్చి ప్రభుత్వాసుపత్రికి లక్షా 50వేల విరాళం



బుచ్చిరెడ్డిపాళెంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు స్నానపు గదుల నిర్మాణానికి దొడ్ల రుక్మిణమ్మ, వరదారెడ్డి చారిటబుల్ ట్రస్ట్ వారు ఇటీవల లక్షా 50వేల రూపాయలు విరాళంగా అందించారు. 1950లో బుచ్చి ఆసుపత్రిలో బాలింతలు, గర్భిణుల సౌకర్యార్థం దొడ్ల వరదారెడ్డి సతీమణి శ్రీమతి రుక్మిణమ్మ తమ సొంత నిధులతో భవనం నిర్మించారు. ఆ రోజుల్లో బాలింతలు, గర్భిణుల కోసం వారు భోజనం, పాలు, మందులు వగైరాలన్నీ పంపిణీచేసేవారు. కాలక్రమంలో ఆ భవనం మరమ్మతులకు గురికాగా 2016లో ప్రభుత్వం ఆ ఆసుపత్రిని బాగుచేయించి ఆ భవనాన్ని వ్యాధినిర్ధారణ కేంద్రంగా ఉపయోగిస్తున్నారు. ఈ కేంద్రంలో స్నానపుగదులు లేక వ్యాధిగ్రస్తులు ఇబ్బందులు పడడాన్ని గమనించిన దాతలు తమ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా విరాళం అందించి తమ వితరణ గుణాన్ని, సేవాభావాన్ని చాటుకున్నారు.

# ప్రారంభమైన అగ్నిమాపక వారోత్సవాలు

ప్రజల్లో చైతన్యంతోనే అగ్నిప్రమాదాల నివారణ సాధ్యమని, ప్రజలకు అవగాహన కలిగించే కార్యక్రమాలు చేపట్టాలని జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి సురేష్ పేర్కొన్నారు. అగ్నిమాపక శాఖ కార్యాలయంలో ఈ నెల 14 నుండి ప్రారంభమైన అగ్నిమాపక వారోత్సవాలను ఆయన, జిల్లా అగ్నిమాపక శాఖాధికారి శ్రీకాంత్‌రెడ్డితో కలసి ప్రారంభించారు. ఈ వారోత్సవాలకు సంబంధించి వాల్ పోస్టర్లు, కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అగ్ని ప్రమాదాల నియంత్రణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సూచనలకు సంబంధించి కరపత్రాలను ప్రజలకు పంచిపెట్టారు. ఏడీఎఫ్ఓ పి.శంకర్ ప్రసాద్, నెల్లూరు ఎస్ఎఫ్ఓ శ్రీనివాసులురెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.



'ప్రభా'తం

# అగ్నికీలల్లో అడవులు



**పచ్చదనాన్ని పర్యావరణాన్ని కాపాడుతూ, జీవ వైవిధ్యాన్ని పరిరక్షించడంలో అడవులదే ప్రధాన పాత్ర. ఒక్క మాటలో చెప్పాలంటే సమస్త మానవజాతి మనుగడకు ప్రాణం పోసేది అడవులే. మనందరికీ ప్రాణవాయులందించే చెట్టుచేమలతో నిండివున్న అడవులను ఎండాకాలాల్లో తరచూ జరిగే ఘోర అగ్నిప్రమాదాల నుంచి మనం రక్షించుకోవాలి. మానవ తప్పిదాలతోనో... నిర్లక్ష్యంతోనో అడవులు అగ్నికీలలకు ఆహుతైపోతే.. చివరికి మానవ మనుగడకే ముప్పు. ఇకనైనా అడవుల సంరక్షణ మనందరిదీ అనే భావం పెంపొందించుకుని మన అడవుల్ని మనమే కంటికి రెప్పలా కాపాడుకోవడం ఎంతో ముఖ్యం.**

మనం చూస్తూనే ఉంటాం. మనకు దూరంగా ఉన్న అడవుల్లో, కొండకోనల్లో ఒక్కోసారి ఉన్నట్లుండి ఎర్రటి మంటలు ఉవ్వెత్తున లేస్తుంటాయి. కానీ ఆ మంటలను ఆర్పడానికి ప్రయత్నాలు చేసేవారు చాలా తక్కువ. కనీసం సంబంధిత అధికారులకు సమాచారం ఇచ్చేవారూ కరువే. ఎందుకంటే అడవులంటే అవి అటవీశాఖకో, లేదా ప్రభుత్వాలకో సంబంధించినవి మాత్రమేనని, వాటి సంగతి వాళ్లే చూసుకుంటారనే అభిప్రాయం అత్యధిక ప్రజానీకంలో ఉంది. అడవులను కాపాడుకునేందుకు ప్రభుత్వాలు తీసుకునే చర్యలు ఎటూ తీసుకుంటూనే ఉంటాయి కానీ.. అడవులు అగ్నిప్రమాదాల బారిన పడకుండా, అగ్నికీలల్లో పడి దహించుకుపోకుండా కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రజలందరిదీ అని గుర్తించాలి. ఎందుకంటే కేవలం మనకే కాదు, సమస్త మానవజాతి మనుగడకు ప్రాణం పోసేది అడవులే. పచ్చదనాన్ని పర్యావరణాన్ని కాపాడుతూ, జీవ వైవిధ్యాన్ని పరిరక్షించడంలో అడవులదే ప్రధానపాత్ర. కర్బన ఉద్గారాలను బలహీనం చేసి భూతాపాన్ని తగ్గించడంలో అడవులదే ముఖ్య భూమిక. భూ తాపం వల్లనే ఎండవేడిమి బాగా పెరిగిపోతోంది. అంతేకాదు ఎండాకాలంలో రావాల్సిన ఎండలు ముందుగానే వచ్చి అందరినీ మాడ్చేస్తున్నాయంటే కారణం అదే. వాతావరణ సమతౌల్యం సక్రమంగా లేకపోవడానికి కూడా భూ తాపమే ప్రధాన కారణమని శాస్త్రవేత్తలు ఎప్పటినుంచో చెప్తూనే ఉన్నారు. ఎవరు పట్టించుకుంటున్నారు కనుక?.. మనందరికీ ప్రాణవాయులందించే చెట్టుచేమలతో నిండివున్న అడవులను మనం రక్షించుకోకపోతే ఇంకెవరు రక్షిస్తారు?.. అందువల్ల అడవుల రక్షణ బాధ్యత మనందరిదీ అనే చైతన్యం ప్రజల్లో బాగా పెరగాలి. అందుకు ప్రభుత్వాలు పెద్దఎత్తున అవగాహన సదస్సులు పెట్టి మరీ ప్రజలకు చెప్పాలి. ఇప్పటికే రకరకాల కారణాల వల్ల అడవుల విస్తీర్ణం బాగా తగ్గిపోతోంది. ప్రపంచవ్యాప్తంగా ఈ దుస్థితి ఉన్నా, మనదేశంలోనూ అంతకన్నా భిన్నమైన పరిస్థితి ఏమీ లేదు. అనేక రంగాల అభివృద్ధి కోసమని పచ్చగా కళకళలాడే అడవులను, అటవీభూములను నాశనం చేసుకుంటుండడం వల్ల దేశంలో అడవులు ఇటీవలి కాలంలో బాగా తగ్గిపోతున్నాయి. చిత్తం వచ్చిన రీతిగా పట్టణీకరణ, పారిశ్రామికీకరణ వంటివి సహజ వనరులను వత్తిడికి గురిచేస్తూ జీవ వైవిధ్యాన్ని బాగా దెబ్బతీస్తున్నాయని నిపుణులు చెప్తున్నారు. ఇందుకు సంబంధించి ప్రపంచవ్యాప్తంగా ఉన్న 35 హాట్‌స్పాట్‌లలో మనదేశంలోనే 5 ఉన్నాయని యునెస్కో ఒక తాజా నివేదికలో హెచ్చరించింది కూడా. మనదేశంలో గత పదేళ్లలోనే 35 శాతం దాకా అడవులు అంతరించిపోయాయని అంచనా. అడవుల నిర్మూలన వల్ల జీవ వైవిధ్యం బాగా దెబ్బతింటోంది. దీంతో పర్యావరణానికే ముప్పు ఏర్పడే ప్రమాదం ఎంతైనా ఉంది. ఇవన్నీ కోరి పెట్టుకునే కొరివి లాంటి ప్రమాదాలే. మనదేశంలో పచ్చదనాన్ని పర్యావరణాన్ని కాపాడుకోవాలనే మాటలు కోటలు దాటుతుంటాయే తప్ప ఆచరణకొచ్చేసరికి అవన్నీ నీటిమూటలుగానే మిగిలిపోతున్నాయి. చెట్లు ప్రగతికి మెట్లు, 'వృక్షో రక్షతి రక్షితః'..వంటివన్నీ నినాదప్రాయంగానే ఉంటున్నాయి. చెట్లను ఇష్టం వచ్చినట్లుగా నరికిపారేసి ఇంధనంగా వాడేసుకుంటున్నాం. చెట్లను కొట్టేయకుండా రోడ్డేసుకునే పరిజ్ఞానం మనకున్నా..రోడ్లను వెడల్పు చేసుకోవాలని అడ్డొచ్చిన పెద్దపెద్ద వృక్షాలను సైతం కూల్చిపారేస్తున్నాం. పంటపొలాలను ఇళ్లప్లాట్లుగా..రియల్ ఎస్టేట్లుగా మార్చేసుకుంటున్నాం. పచ్చదనానికి మనమే కాటువేస్తున్నాం. దీంతో పర్యావరణ సమతుల్యత బాగా తగ్గిపోయి, వేడిగాలులు పెరిగిపోయి చల్లటి గాలి కూడా కరువై చివరికి మనమే ఎంతో ఇబ్బందిపడుతున్నాం.

అంతేకాదు, మానవ తప్పిదాల వల్ల ఏర్పడే అగ్నిప్రమాదాలు కూడా అడవులు నాశనం కావడానికి కారణమవుతుండడం మరింత బాధాకరం. అడవిలో ఎవరో ఒకరు అగ్గి రాజేస్తారు. నిర్లక్ష్యంగా ఏ చుట్టో, బీడీయో కాల్చి పడేస్తారు. కొంతమంది వన విహారాలకు వెళ్లి వంటలు చేసుకుని పొయ్యిలో నిప్పును ఆర్పకుండా నిర్లక్ష్యంగా వదిలేస్తుంటారు. ఇవే చివరికి గాలికి అంటుకుని ఏ కార్చిచ్చు గానో, దావానలంగానో మారి చివరికి అడవుల్ని భస్మీపటలం చేస్తున్న సంఘటనలు కోకొల్లలు. ఇలాంటి కారణాలతో మనదేశంలో ప్రతి ఏటా వేలాది కార్చిచ్చు ఘటనలు నమోదవుతూనే ఉన్నాయి. అత్యధికంగా మిజోరం, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, ఒడిశా, మధ్యప్రదేశ్, తెలంగాణ అటవీప్రాంతాలు ఇలాంటి ప్రమాదాలకు గురవుతున్నాయని నిపుణుల నివేదికలు చెప్తున్నాయి. అందువల్ల అడవుల్లోను, అటవీప్రాంతల్లోను అగ్నిప్రమాదాలు జరగకుండా చూసుకోవాలి. అయినా.. ఎండాకాలం వచ్చినప్పుడల్లా దేశంలో అడవులు తగలబడిపోతుండడం ఎంత బాధాకరం?.. కొండకోనలు..అడవుల్లో చెట్టుచేమలే కాదు అనేకరకాలైన పక్షులు, జంతువులు, ఎన్నో రకాల జీవరాశులు ఉంటాయి. అవన్నీ మనం నిర్లక్ష్యంగా చేసే ప్రమాదాల అగ్నికీలలకు మలమల మాడిపోవాల్సిం దేనా?..ఎండాకాలం వచ్చినప్పుడల్లా అడవుల్లో ఇలాంటి కార్చిచ్చులు రగులుకోవాల్సిందేనా?..కోట్లాదిరూపాయల విలువైన అటవీ సంపద అంతా అగ్గికి బుగ్గి కావాల్సిందేనా?..ఇకనైనా ఈ దుస్థితి మారాలి. అడవుల పట్ల సరైన అవగాహనతో అటవీ సంరక్షణకు అందరూ కంకణం కట్టుకోవాలి. ప్రభుత్వాలు, స్వచ్ఛంధసంస్థలు, మేధావులు అంతా ఇందులో భాగస్వాములు కావాలి. వనదేవత.. మన దేవత అని అందరూ గుర్తుంచుకోవాలి.మన అడవుల్ని మనమే కంటికి రెప్పలా కాపాడుకోవాలి. అడవులు పచ్చగా కళకళలాడుతూ ఉండేలా చూసుకోవాలి!..

# రెండో పంటకు పుష్కలంగా నీళ్ళు

- 5.90 లక్షల ఎకరాలకు సాగునీరు
- మేలో విడుదలకు అధికారుల సన్నాహాలు



**జిల్లాలో రెండో పంటైన ఎడగారు (ఎర్లీ ఖరీఫ్) పంటలకు పుష్కలంగా నీరందించేందుకు జిల్లా జల వనరుల శాఖ అధికారులు రంగం సిద్ధం చేస్తున్నారు. మొత్తంగా 5.90లక్షల ఎకరాలకు సాగునీళ్ళు ఇచ్చేందుకు కృషిచేస్తున్నారు.**

ఒకవైపు కరోనా, మరోవైపు ఎన్నికల కోడ్ ఉండడంతో జిల్లా సాగునీటి సలహామండలి (ఐఏబి) సమావేశం నిర్వహించలేని నేపథ్యంలో జిల్లా కలెక్టర్ అనుమతితో అధికారులు రెండో పంటకు నీటి విషయమై చర్చించి నిర్ణయాలు తీసుకున్నారు. ఈనెల 12న రామలింగాపురంలో ఉన్న జలవనరులశాఖ కార్యాలయంలో తెలుగుగంగ ప్రాజెక్టు చీఫ్ ఇంజనీర్ హరినారాయణరెడ్డి, జలవనరులశాఖ ఎస్ఇ కృష్ణారావు, ఎ.ఇ కృష్ణమోహన్ ఆ వివరాలు తెలియజేశారు. సోమశిల, కండలేరు డ్యామ్‌ల నుంచి మొత్తం 5.90 లక్షల ఎకరాలకు సాగునీరు విడుదల చేయడం జరుగుతుందన్నారు. ప్రస్తుతం సోమశిల డ్యామ్‌లో 58 టిఎంసిల నీరుందని, ఇందులో 40,573 టిఎంసిల నీటిని, పెన్నార్ డెల్టా పరిధిలోని కనిగిరి, సర్వేపల్లి డ్యామ్‌లలోని 1900 టిఎంసిల నీటిని కలుపుకుని మొత్తం 42,440 టిఎంసిల నీటిని రెండోపంటకు విడుదల చేయనున్నట్లు వారు చెప్పారు. కండలేరులో 48.3 టిఎంసిల నీరుందని, దీంట్లో 20.5 టిఎంసిలను 2.5 లక్షల ఎకరాలకు విడుదల చేస్తామని చెప్పారు. సర్వేపల్లి కాలువ, డిఆర్ ఛానల్, డిఎం ఛానల్స్ అభివృద్ధి పనులు జరుగుతున్నందువల్ల ఆ కాలువల ఆయకట్టుకు ఇప్పుడు నీరు ఇవ్వడం లేదని, పనులు పూర్తికాగానే రబీ సీజన్‌కు నీళ్లిస్తామన్నారు.

## ప్రభుత్వాసుపత్రుల్లో సిఐడి తనిఖీలు

ప్రభుత్వ ఆసుపత్రుల్లో జరిగిన అవకతవకలపై జిల్లాలో సిఐడిల తనిఖీలు జరుగుతున్నాయి. ఆసుపత్రుల్లో బయో మెడికల్ పరికరాల కొనుగోలులో మతలబులపై మంగళగిరి సిఐడి అధికారులు ఇటీవల కేసు నమోదు చేసిన నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా తనిఖీలు ముమ్మరం చేశారు. నెల్లూరు రీజియన్ అదనపు ఎస్పీ పి.రాజేంద్రకుమార్ ఆధ్వర్యంలో నెల్లూరు, ప్రకాశం జిల్లాల్లో విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. నెల్లూరు సిఐడి డిఎస్పీ రాంబాబు సారధ్యంలో ఆరు బృందాలు జిల్లా వ్యాప్తంగా పరిశీలనలు చేస్తున్నాయి. దాదాపు 96 ఆసుపత్రుల్లో బయో మెడికల్ పరికరాలకు సంబంధించిన రికార్డులు, పరికరాలను పరిశీలించిన తర్వాత సిఐడి అధికారులు తమ నివేదికను రాష్ట్ర ఉన్నతాధికారులకు నివేదించనున్నట్లు సమాచారం.

# మాదాసు నిష్క్రమణతో జనసేనకు మంచి రోజులు

ఈ-మెయిల్
ప్రజావాణి
@
lawyerpatrika@gmail.com
+91 98663 14741
WhatsApp

పవన్‌కళ్యాణ్ జనసేన పార్టీ ప్రకటించిన రోజు నుండీ ఆయన పక్కనే చేరిన మాజీ శాసనమండలి సభ్యుడు మాదాసు గంగాధరం మూడురోజుల నాడు రాజీనామా చేసి వెళ్లిపోతున్నట్లు ప్రకటించాడు.

శుభం...! జనసేనానికి, ఆయన పార్టీకి ఇక ముందు అన్నీ మంచిరోజులే అని చెప్పొచ్చు. మాదాసు ఎక్కడ పాదం మోపితే అక్కడ మటాషే అన్న నానుడి ఉంది. జాతీయస్థాయి నుండి గమనిస్తే ఆకస్మిక ప్రమాదాలలో మరణించిన రాజేష్ పైలెట్, మాధవరావు సింధియాలు మాదాసుకి అత్యంత సన్నిహితులు. వాళ్ళిద్దరినీ ఈయన అంటిపెట్టుకున్న తరుణంలోనే వాళ్ళు దివంగతులైపోయారు.

ఇక రాష్ట్ర స్థాయిలో చూస్తే స్వర్గీయ నందమూరి రామారావుకి కూడా ఈయన పక్కనున్నన్ని రోజులూ కష్టాలే. ఆ తరువాత రామారావుని వదిలి నల్లపరెడ్డి శీనయ్య పక్కన చేరాడు, శ్రీనివాసులరెడ్డి రాజకీయ జీవితంలో ఎప్పుడూ లేనంత అప్రతిష్టని ఈయన సారధ్యంలో శీనయ్య సేనను నడిపిన సమయంలో మూటకట్టుకున్నాడు. ఆ తరువాత మాగుంట సుబ్బరామిరెడ్డి పక్కన చేరాడు. ఆయన కూడా అకస్మాత్తుగా కనుమరుగైపోయాడు. రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో గంగాధరాన్ని నెత్తిన పెట్టుకున్నాడు. చాలామంది ఈయన శక్తి గురించి, వైయస్‌ని హెచ్చరించినా ఆయన చెవిన పెట్టుకోలేదు. ఫలితంగా ఆయనా పంచభూతాలలో కలిసిపోయాడు. మధ్యలో జిల్లాకు చెందిన మాజీ శాసనసభ్యుడు జెకె రెడ్డి, ప్రస్తుత నెల్లూరు యంపి ఆదాల ప్రభాకరరెడ్డిలు కూడా మాదాసుతో అతిగా దోస్తీ చేసినా కొద్దికాలం తరువాత ఈయన పవర్ తెలిసి దూరంగా పెట్టారు. జనసేన పార్టీలో మొట్టమొదట కాలుపెట్టిన రాజకీయ నాయకుడు మాదాసు గంగాధరమే. పాపం పవర్‌స్టార్‌కి ఈయన లెగ్గు పవర్ తెలియక పార్టీ పెత్తనం కూడా ఇచ్చాడని అంటారు. రాష్ట్రాన్ని పాలించాలని రాజకీయాలలోకి వచ్చిన పవన్ కళ్యాణ్, 2019లో జరిగిన సార్వత్రిక ఎన్నికలలో కనీసం తాను కూడా గెలవకపోవడం గమనిస్తే పార్టీపై ఈ పాదం ప్రభావం ఏ స్థాయిలో పనిచేసిందో వేరే ఉదాహరణ అవసరం లేదు. విషయం తెలిసిన కొంతమంది జనసేన నాయకులూ, కార్యకర్తలు మాదాసు మహిమ గురించి వాళ్ళల్లో వాళ్ళే చెవులు కొరుక్కున్నారు తప్ప తమ నాయకుడికి చెప్పే ధైర్యం చెయ్యలేకపోయారని కూడా అంటారు.

ఇప్పుడు తమ పార్టీకి మంచి రోజులు వస్తాయని పార్టీ శ్రేణులు సంబరాలు చేసుకుంటున్నారు. కొంతమంది మీడియా అధిపతులకు పాపం గంగాధరమహిమ గురించి తెలిసినట్లు లేదు. గంగాధరం రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించగానే, జనసేనకు పెద్ద షాక్ అని రాసేశారు. ఆ పత్రికలోళ్ళు గంగాధరాన్ని తీసుకెళ్లి తమ సంస్థలో సలహాదారులుగా చేర్చుకుంటే బాగుంటుందేమో. ఏది ఏమైనా గంగాధరం రాజీనామాతో జనసేనకు కొత్త కళ వస్తుందని ఆశిద్దాం.

– కె.వి.యన్.బాబు, **సూళ్లూరుపేట.**

# సమాజ సేవకులకు సన్మానాలు

కరోనా, లాక్‌డౌన్‌లో విశిష్ట సేవలను అందించిన సమాజ సేవకులు దూబిశెట్టి కళ్యాణి, సాయిరక్ష ఛారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకురాలు గునుకుల సుమలత 'విశ్వగురు వరల్డ్ రికార్డ్స్' ఉగాది పురస్కారాలను అందుకున్నారు. శివాజీ యూత్ ఫెడరేషన్ ఛైర్మన్, విశ్వగురు వరల్డ్ రికార్డ్స్ జిల్లా కో ఆర్డినేటర్ ఆధ్వర్యంలో నెల్లూరులోని నోవాబ్లడ్ బ్యాంకులో ఎస్ఈబీ ఏఎస్పీ శ్రీలక్ష్మి చేతుల మీదుగా ఈనెల 12న ఈ పురస్కారాల ప్రదానం జరిగింది. ఈ సందర్భంగా ఎస్ఇబి ఏఎస్పీ శ్రీలక్ష్మి మాట్లాడుతూ లాక్‌డౌన్‌లో సొంత నిధులతో, స్నేహితుల సహకారంతో వందలాది మందికి భోజనాలు, వస్త్రాలు అందజేసిన కళ్యాణి, సుమలతలను అభినందించారు. డాక్టర్ సీహెచ్ కవితాకిరణ్, స్వచ్ఛంధసేవకులు కవితారెడ్డి, సరస్వతి, పద్మజ, యోగాగురువు సుకన్య, కామాక్షి, రిషిత, నోవా బ్లడ్‌బ్యాంకు అడ్మినిస్ట్రేటర్ కిషోర్ పాల్గొన్నారు.

# శ్రీసిటీ.. ఓ వరం

## కొనియాడిన రాష్ట్ర మంత్రులు, టిటిడి ఛైర్మెన్




అంతర్జాతీయ ఖ్యాతిగాంచిన శ్రీసిటీ ప్రగతి ఎంతో అద్భుతమని రాష్ట్రానికి చెందిన పలువురు ప్రముఖులు కొనియాడారు. టిటిడి బోర్డు ఛైర్మెన్ వైవి సుబ్బారెడ్డితో పాటు ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి, పంచాయతిరాజ్‌శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, పౌరసరఫరాల శాఖ మంత్రి కొడాలి నాని, ప్రభుత్వ చీఫ్‌విప్ గడికోట శ్రీకాంత్‌రెడ్డి, సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం, శ్రీకాళహస్తి మాజీ ఎమ్మెల్యే ఎస్‌సివి అప్పలనాయుడు తదితరులు ఈనెల 12న శ్రీసిటీని సందర్శించారు. ఈ సందర్భంగా టిటిడి ఛైర్మెన్ వైవి సుబ్బారెడ్డి మాట్లాడుతూ 28 దేశాలకు చెందిన 190 పరిశ్రమలు, 50 వేలకు పైగా ఉద్యోగులు, ముఖ్యంగా 50 శాతం మహిళా ఉద్యోగులతో ఎంతో అభివృద్ధితో విరాజిల్లుతున్న శ్రీసిటీ ప్రగతికి కృషి చేస్తున్న యాజమాన్యాన్ని ప్రశంసించారు. తన తండ్రి బాటలో నడుస్తూ యువత ఉపాధికి ఉద్యోగావకాశాలకు ఎంతగానో శ్రమిస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో శ్రీసిటీ పారిశ్రామికంగా మరింత అభివృద్ధి సాధిస్తుందని ఆకాంక్షించారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి మాట్లాడుతూ నాడు ఎమ్మెల్యేగా శ్రీసిటీ ప్రస్థానంలో భాగమైన రోజులను ఆయన గుర్తుచేసుకున్నారు. దివంగత నేత డా.వైఎస్ రాజశేఖర్‌రెడ్డి దిశానిర్ధేశంతో తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు పురుడు పోసుకున్న శ్రీసిటీ నేడు అంతర్జాతీయ స్థాయికి ఎదగడం ఎంతో గర్వంగా ఉందన్నారు.

### రాష్ట్రానికి డా.వైఎస్ ఇచ్చిన వరం.. శ్రీసిటీ – మంత్రి పెద్దిరెడ్డి

ఈ సందర్శనలో పాల్గొన్న మంత్రి పెద్దిరెడ్డి మాట్లాడుతూ దివంగత నేత డా. వైఎస్ రాష్ట్రానికి ఇచ్చిన ఒక గొప్ప వరం శ్రీసిటీ అని అభివర్ణించారు. శ్రీసిటీ రాకతో చిత్తూరు, కడప, నెల్లూరుజిల్లాల్లో నిరుద్యోగ సమస్య పూర్తిగా తొలగిపోవాలని అప్పట్లో డా.వైఎస్ భావించారని, అయితే నేడు శ్రీసిటీ రాష్ట్రం మొత్తానికి ఉపాధి కల్పించేలా అభివృద్ధి సాధిస్తుండడం ఎంతో సంతోషంగా ఉందని అన్నారు. రాష్ట్ర ప్రగతి కోసం, రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసం అహర్నిశలు కృషిచేస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారధ్యంలో శ్రీసిటీ పారిశ్రామికంగా మరెంతో అభివృద్ధి చెందుతుందని ఆకాంక్షించారు. శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ రవీంద్ర సన్నారెడ్డి వారందరినీ తొలుత సాదరంగా ఆహ్వానించి శ్రీసిటీ ప్రగతిని వివరించారు. పారిశ్రామిక అభివృద్ధిని ప్రోత్సహిస్తూ రాష్ట్రమంత్రులు, ప్రముఖులు, ఎమ్మెల్యేలు తరచూ శ్రీసిటీ సందర్శనకు వస్తుండడం తనకెంతో సంతోషంగా ఉందన్నారు. మంత్రులు, ప్రముఖుల సూచనలు, సలహాలు శ్రీసిటీ అభివృద్ధికి ఎంతో దోహదపడతాయని, వారు శ్రీసిటీని సందర్శించడం తామెంతో గౌరవప్రదంగా భావిస్తున్నామని అన్నారు.

# ఆ పార్టీల వల్ల ప్రజలకు ఒరిగిందేమీ లేదు

## - వైకాపా, తెదేపాలపై బిజెపి నేత నడ్డా విమర్శ



రాష్ట్రంలో వైకాపా, తెదేపాల వల్ల ప్రజలకు ఒరిగిందేమీ లేదని, రాష్ట్రాభివృద్ధిని సాధించడంలో ఆ రెండు పార్టీలు వైఫల్యం చెందాయని బిజెపి జాతీయ అధ్యక్షుడు జెపి నడ్డా విమర్శించారు. బిజెపికి అవకాశం ఇస్తే అభివృద్ధి అంటే ఎలా ఉంటుందో చేసి చూపిస్తామన్నారు. తిరుపతి ఉప ఎన్నిక సందర్భంగా ఈనెల 12న నాయుడుపేటలో జరిగిన బహిరంగసభలో ఆయన మాట్లాడుతూ ఆ పార్టీలపై విమర్శలు చేశారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నాలుగు లక్షల కోట్ల అప్పుల ఊబిలో కూరుకుపోయిందన్నారు. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం పెద్దఎత్తున నిధులు ఇస్తూనే ఉందన్నారు. తిరుపతి బిజెపి అభ్యర్ధిని రత్నప్రభను గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. బిజెపికి ఒక్క అవకాశం ఇవ్వాలని, ఆ మార్పు తిరుపతి నుంచే రావాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్ర మంలో బిజెపి రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి సునీల్ దేవ్‌ధర్, బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు తిరుపతి లోక్‌సభ బిజపి అభ్యర్ధి రత్నప్రభ, నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి, ఆదినారాయణరెడ్డి, టిజి వెంకటేష్, సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి, భరత్‌కుమార్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# ఆల్తూరు ఆదినారాయణరెడ్డి.. ఆధ్యాత్మిక సేవలు అమోఘం

## మంత్రి డాక్టర్ అనిల్‌కుమార్‌యాదవ్



ప్రముఖ దాత, దైవభక్తి పరాయణుడు ఆల్తూరు ఆదినారాయణరెడ్డి ఆధ్యాత్మిక సేవలు అమోఘమని, ఆయన అందరి వాడని, అనేక ధార్మిక కార్యక్రమాలు నిర్వహించి తన జీవితాన్ని సార్ధకం చేసుకున్నారని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి డాక్టర్ పోలుబోయిన అనిల్‌కుమార్‌యాదవ్ అన్నారు. ఆల్తూరు ఆదినారాయణరెడ్డి ప్రథమ వర్ధంతి సందర్భంగా ఈనెల 11న తోటపల్లిగూడూరులోని ఆల్తూరు వారి వ్యవసాయక్షేత్రంలో జరిగిన కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ ఆల్తూరు అటు ఆధ్యాత్మికంగాను, ఇటు సామాజికంగాను ఎంతో సేవలందించారని కొనియాడారు. తొలుత ఆల్తూరు ఆదినారాయణరెడ్డి సమాధికి, చిత్రపటానికి పూలమాలలు వేసి ఆయన ఘనంగా నివాళులర్పించారు.

### పార్టీలకు అతీతంగా తరలివచ్చిన ప్రముఖులు :


నిరంతరం దైవచింతనతో ఉంటూ పలు ఆలయాలకు, ధార్మిక సేవా కార్యక్రమాలకు భూరి విరాళాలిచ్చిన దాత ఆల్తూరు ఆదినారాయణరెడ్డి ప్రథమ వర్ధంతి కార్యక్రమానికి పార్టీలకు అతీతంగా జిల్లాకు చెందిన అనేకమంది నాయకులు, ప్రముఖులు తరలివచ్చి ఘన నివాళులర్పించారు. ఆల్తూరు కుటుంబసభ్యులైన ఆల్తూరు సులోచనమ్మ, ఆల్తూరు గిరీష్‌రెడ్డి, ఆల్తూరు మహేష్‌రెడ్డి తదితరులను పరామర్శించారు. ఆల్తూరు ఆత్మకు శాంతి కలగాలని అందరూ కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి టిడిపి నేత సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, వైకాపా నేత నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే బీద మస్తాన్‌రావు, విజయ డెయిరీ ఛైర్మెన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, ఆనం వెంకటరమణారెడ్డి, ఏసి సుబ్బారెడ్డి, సన్నపురెడ్డి పెంచలరెడ్డి, ఈదూరు రామ్మోహన్ రెడ్డి, గొలగమూడి వెంకయ్యస్వామి ఆలయం ఇ.ఓ పి.బాలసుబ్రహ్మణ్యం, పలు ఆలయాల ట్రస్ట్‌బోర్డుల అధ్యక్షులు పాల్గొన్నారు.

# రానున్న మూడు నెలలు ఎంతో కీలకం

## - కోవిడ్‌తో జాగ్రత్త అంటున్న కలెక్టర్ చక్రధర్‌బాబు



కోవిడ్ పాజిటివ్ కేసులు భారీగా పెరుగుతున్నాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ముఖ్యంగా రానున్న రెండు మూడు నెలలు ఎంతో కీలకమని జిల్లా కలెక్టర్ చక్రధర్‌బాబు అన్నారు. ఈనెల 11న ఆయన జిల్లా అధికారులతో సమావేశమై కరోనా పరిస్థితులను సమీక్షించారు. కోవిడ్ ఆసుపత్రుల్లో మెరుగైన సేవలందించాలని, అత్యవసర పడకలు, వైద్యపరికరాలు, మందులు అన్నీ సిద్ధంగా ఉంచుకోవాలని అధికారులకు సూచించారు. కోవిడ్ రోగులకు సేవలందించడంలో ఎలాంటి జాప్యం కానీ, అలక్ష్యం కానీ ఉండకూడదన్నారు. బాధితులకు 24 గంటలూ సేవలందించేందుకు సిద్ధంగా ఉండాలని, రానున్న రోజుల్లో కోవిడ్ కేసులు మరింతగా పెరిగే అవకాశం ఉందని, కనుక ప్రతిఒక్కరూ మాస్కులు ధరించాలని, కోవిడ్ సోకకుండా ప్రభుత్వం సూచించిన నియమాలను తప్పనిసరిగా పాటించాలని చెప్పారు. జిల్లాలో సుమారు 28 లక్షల మంది దాకా జనాభా ఉంటే ఇప్పటికే 2.80 లక్షలమందికి కోవిడ్ టీకా వేశామని, 45ఏళ్ళు దాటిన వారంతా తప్పనిసరిగా కోవిడ్ టీకా వేసుకునేలా చూడాలని ఆయన సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి, డిఎం అండ్‌హెచ్ డాక్టర్ రాజ్యలక్ష్మి తదితర అధికారులు, నోడల్ అధికారులు, ప్రైవేట్ ఆసుపత్రుల ప్రతినిధులు పాల్గొన్నారు.

# నెల్లూరు కబుర్లు

## సామాజిక ఉద్యమ నేత పూలే

**జిల్లా కలెక్టర్ చక్రధర్‌బాబు**



నాటి సమాజంలో ప్రజల్లో చైతన్యాన్ని రగిలించి, సామాజిక రుగ్మతలను పారద్రోలడానికి ఎంతో కృషిచేసిన సామాజిక ఉద్యమనేత మహాత్మా జ్యోతిరావు పూలే అని, ఆ మహాశయుని ఆశయాలను ఆదర్శంగా తీసుకుని ప్రతిఒక్కరూ సమాజాభివృద్ధికి పాటుపడాలని జిల్లా కలెక్టర్ కేవీఎన్ చక్రధర్‌బాబు అన్నారు.

కలెక్టరేట్‌లోని తిక్కనభవన్‌లో బీసీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ఈ నెల 11న మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బాలికలకు విద్య కోసం ప్రత్యేక పాఠశాలలను స్థాపించి వారి చదువుల కోసం పూలే ఎంతో కృషి చేశారన్నారు. పూలే ఆశయాలకు అనుగుణంగా మహిళల అక్షరాస్యత శాతం పెంచాల్సిన అవసరం ఉందని, బాలికలు ఉన్నత విద్యలు చదువుకునేలా అందరూ సహకారం అందించాలని అన్నారు. ఉగాది నుంచి బాలికల ఆరోగ్యం, విద్యపై ప్రతిఒక్కరూ బాధ్యతతో పనిచేయాలని, అభివృద్ధి సూచికలో జిల్లాను ప్రథమస్థానంలో నిలిపేందుకు అన్ని శాఖల అధికారులు కృషిచేయాలని చెప్పారు. తొలుత జ్యోతిరావు పూలే చిత్రపటానికి కలెక్టర్ పూలమాల వేసి నివాళులర్పించారు. తిరుపతి పార్లమెంట్ ఉప ఎన్నికల వ్యయ పరిశీలకులు ఆనందకుమార్, జేసీ (ఆసరా) బాపిరెడ్డి, డీఆర్వో చిన ఓబులేసు, జిల్లా బీసీ సంక్షేమాధికారి వెంకటయ్య, జెడ్పీ సీఈఓ సుశీల తదితరులు పాల్గొన్నారు.

## మమ్మల్ని కొనసాగించండి

**విద్యామంత్రికి ఒప్పంద అధ్యాపకుల వినతి**

ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో పనిచేస్తున్న తమను కొనసాగించాలని ఒప్పంద (కాంట్రాక్ట్) అధ్యాపకుల సంఘం ప్రతినిధులు ఈనెల 11న నెల్లూరుకు వచ్చిన విద్యాశాఖ మంత్రి ఆదిమూలపు సురేష్‌కు విన్నవించుకున్నారు. కాంట్రాక్ట్ అధ్యాపకులను త్వరితగతిన రెన్యువల్ చేయాలని, సర్వీసుకు అవరోధం కలగకుండా పూర్తిగా 12 నెలల కాలానికి రెన్యువల్ ఇవ్వాలని కోరుతూ వినతిపత్రం సమర్పించారు. అందుకు స్పందించిన మంత్రి వారికి న్యాయం చేస్తామంటూ హామీ ఇచ్చారు. సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సునీల్‌శర్మ, రాష్ట్ర కార్యదర్శి జి.సాయి కిరణ్, జిల్లా ప్రధాన కార్యదర్శి పి.కోటేశ్వరరావు, వెంకటేశ్వర్లు, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## రక్తదాతలంటే.. ప్రాణదాతలే

**- రెడ్‌క్రాస్ చైర్మెన్ చంద్రశేఖర్‌రెడ్డి**



రక్తదానంటే ప్రాణ దానమేనని, రక్తదాతలంటే ప్రాణదాతలేనని, రక్తాన్ని దానం చేయడం ద్వారా బాధితుల ప్రాణాలను నిలబెట్టినట్లవుతుందని నెల్లూరు రెడ్‌క్రాస్ చైర్మెన్ చంద్రశేఖర్‌రెడ్డి చెప్పారు. గత నెలలో రక్తదానం చేసిన వాకర్స్ సభ్యులను అభినందిస్తూ ఈనెల 11న నగరంలోని ఏసి సుబ్బారెడ్డి స్టేడియంలో ఏర్పాటైన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలన్నారు. రక్తదాతలందరికీ అభినందనలు తెలియజేశారు. నగరంలోని ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పలగాటి శ్రీనివాసులురెడ్డి, ఏకోల్లు రాఘవరెడ్డి, నలుబోలు బలరామయ్యనాయుడు, వేలూరు రంగారావు, స్మైల్ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సోము భక్తవత్సలరెడ్డి, వినుకొండ వెంకటేశ్వర్లు, యస్దానీ, మాగంటి ప్రసాద్, వెంకట సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## ఉప ఎన్నికలకు భారీ బందోబస్తు



ఎస్పీ భాస్కర్‌భూషణ్

శాంతియుత వాతావరణంలో తిరుపతి పార్లమెంట్ ఉప ఎన్నికలు నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నామని ఎస్పీ భాస్కర్‌భూషణ్ చెప్పారు. ఈనెల 12న ఆయన నెల్లూరులో విలేకరు లతో మాట్లాడుతూ ఈ నెల 17న తిరుపతి పార్లమెంట్ ఉప ఎన్నిక పోలింగ్ జరగనున్న నేపథ్యంలో భద్రతా ఏర్పాట్లను కట్టుదిట్టం చేశామన్నారు. సుమారు 4 వేలమంది పోలీసు సిబ్బంది బందోబస్తు విధుల్లో ఉంటారని, ఇప్పటికే సీఏపీఎఫ్ (సెంట్రల్ ఆర్మ్‌డ్ పోలీసు ఫోర్స్), 11 కంపెనీలు జిల్లాకు వచ్చాయన్నారు. జిల్లాలో 241 అత్యంత సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించామని, ఆయా ప్రాంతాల్లో పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఎన్నికల సందర్భంగా ఓటర్లను ఎవరైనా ప్రలోభాలకు గురిచేస్తే అలాంటివారిపై కఠినచర్యలు తీసుకుంటామన్నారు. కరోనా వేగంగా వ్యాపిస్తున్న నేపథ్యంలో ప్రజలందరూ నిబంధనలు పాటిస్తూ, శాంతియుత వాతావరణంలో తమ ఓటుహక్కును వినియోగించుకోవాలన్నారు.

## ఉద్యోగులకు అండగా ప్రభుత్వం

**ఎన్జీఓల సంఘం నేత చంద్రశేఖర్‌రెడ్డి**

రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులకు అండగా ఉంటూ తమ సమస్యలను పరిష్కరిస్తోందని ఏపీ ఎన్జీఓ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.చంద్రశేఖర్‌రెడ్డి సంతోషం వ్యక్తం చేశారు. ఈనెల 12న ఆయన నెల్లూరులోని ఎన్జీఓ భవన్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఉద్యోగులు అడగక ముందే 27 శాతం మధ్యంతర భృతిని ప్రభుత్వం ఇచ్చిందన్నారు. ప్రజలు, ఉద్యోగుల పట్ల ప్రభుత్వం అనుసరిస్తున్న తీరు ఎంతో బావుందన్నారు. పీఆర్సీకి సంబంధించి ప్రభుత్వం ఒక కమిటీ వేసిందని, ఈ నెలాఖరులోపే ప్రభుత్వం ఉద్యోగులకు అనుకూలంగా పీఆర్సీని ఇవ్వబోతుందనే నమ్మకం ఉందన్నారు. ఏపీ ఎన్జీఓ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బండి శ్రీనివాసరావు, రాష్ట్ర కోశాధికారి వెంకటేశ్వర్లురెడ్డి, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు శేఖర్‌రావు, ఆంజనేయవర్మ, ఆర్గనైజింగ్ సెక్రటరీ మన్నేపల్లి పెంచలరావు, ఉపాధ్యక్షులు లక్కాకుల పెంచలయ్య, జి.రమేష్ బాబు, మధు, మాధవయ్య, కోశాధికారి వెంకటేశ్వర్లు, సంయుక్త కార్యదర్శులు రాజేంద్రప్రసాద్, రామకృష్ణ, వెంకటస్వామి పాల్గొన్నారు.

## 'ఫ్రెండ్స్ వాకర్స్' ఉగాది సంబరాలు



ఉగాది పండుగ సందర్భంగా ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 13న పలగాటి శ్రీనివాసులురెడ్డి అధ్యక్షతన ఉగాది సంబరాలు జరిగాయి. ఈ సందర్భంగా కె.శ్రీనివాస రాఘవాచార్యులుచే పంచాంగ శ్రవణం జరిగింది. వాకర్స్ మిత్రులు సంప్రదాయ దుస్తులతో విచ్చేసిన వారందరినీ కండువాలతో సత్కరించారు. షడ్రుచుల ఉగాది పచ్చడిని పంచిపెట్టారు. ఈ సందర్భంగా 1961 సంవత్సరం ప్లవ నామ సంవత్సరంలో జన్మించిన బి.సూర్యనారాయణను సన్మానించారు. వాకర్స్ సంఘాల నాయకులు నేతాజీ సుబ్బారెడ్డి, ఏకొల్లు రాఘవరెడ్డి, నలుబోలు బలరామయ్యనాయుడు, వినుకొండ వెంకటేశ్వర్లు, మాగంటి ప్రసాద్‌లతో పాటు వీరిశెట్టి హజరత్‌బాబు, బుజ్జయ్య, చెంచయ్య, శివయ్య, పి.వి.కృష్ణారెడ్డి, ఇనుకొండ సోను, కొండూరు సుబ్బారావు పాల్గొన్నారు.

## టీకా కేంద్రాలను పరిశీలించిన మెప్మా పి.డి

మెప్మా ప్రాజెక్టు పరిధిలోని పొదుపు సంఘాల కుటుంబసభ్యులకు చేపట్టిన టీకా (వ్యాక్సినేషన్) కేంద్రాలను ఇటీవల మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్ డాక్టర్ డి.రవీంద్ర పరిశీలించారు. నెల్లూరు నగర పరిధిలో నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో వీరికోసం ఏర్పాటుచేసిన తొమ్మిది టీకా కేంద్రాలను పర్యవేక్షించి 45 సంవత్సరాల పైబడిన వారంతా తప్పనిసరిగా టీకా వేసుకోవాలని సూచించారు. టీకాపై ఎలాంటి అపోహలు వద్దని, టీకా వేసుకోవడం ఆరోగ్యానికి ఎంతో సురక్షితమని, టీకా వేసుకుంటే కరోనాను దూరం చేసుకోవచ్చని వివరించారు. ఈ కార్యక్రమంలో అర్బన్ సమాఖ్య అధ్యక్షురాలు భవాని, సిటి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



## వేదపండితులకు పురస్కారాలు

ఉగాది పండుగను పురస్కరించుకుని దేవాదాయశాఖ ఎంపిక చేసిన పలువురు ఉత్తమ అర్చకులు, వేదపండితులకు జిల్లా కలెక్టర్ చక్రధర్‌బాబు ఈనెల 13న ఉగాది పురస్కారాలను అందజేశారు. సంప్రదాయబద్ధంగా పండ్లు, పట్టు వస్త్రాలను వారికి అందజేయడంతో పాటు ఒక్కొక్కరికి 10,116 రూపాయల నగదును కూడా అందజేశారు. అర్చకులు కిడాంబి జగన్నాధాచార్యులు, పరాంకుశం ప్రసాదాచార్యులు, వేదపండితుడు గుద్లూరి ఫణికుమార్‌శర్మ ఈ పురస్కారాలను అందుకున్నారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ ధర్మాదాయ శాఖ కమిషనర్ శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వరసిద్ధి విఘ్నేశ్వరునికి వెండి పూలహారం

నెల్లూరు బాలాజీనగర్‌లోని ఉగాది సెంటర్‌లో కొలువై ఉన్న వరసిద్ధి విఘ్నేశ్వరస్వామికి ఈనెల 13న తడకపల్లి సుధ-రవీంద్ర బాబు దంపతులు లక్ష రూపాయల విలువైన వెండి పూలహారాన్ని బహూకరించారు. ఆలయ చైర్మెన్ కంచి మల్లికార్జునరెడ్డికి ఆ హారాన్ని అందజేశారు. ఈ సందర్భంగా స్వామివారికి విశేష పూజలు, అభిషేకాలు చేశారు.

## ఈ ఏడాది 208 కోట్ల స్త్రీనిధి రుణాలు

**- ఏజిఎం హేమంతకుమార్**

జిల్లాలో 2021-22 ఆర్థిక సంవత్సరంలో 41,700 మంది పొదుపు సభ్యులకు రూ.208.50 కోట్ల స్త్రీనిధి రుణాలు మంజూరు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని స్త్రీనిధి ఏజీఎం వి.హేమంత కుమార్ తెలిపారు. ఈనెల 12న నెల్లూరులోని డిఆర్‌డిఏ కార్యాలయంలో స్త్రీనిధి క్లస్టర్ మేనేజర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ఆర్థిక సంవత్సరంలో 27,800 మంది మహిళలకు రూ.139 కోట్లు స్త్రీనిధి రుణాలు మంజూరు చేయాలని లక్ష్యం కాగా, 28,027 మంది మహిళలకు రూ.141.61 కోట్లు మంజూరు చేసినట్లు చెప్పారు.

## సాయి సేవకులకు సత్కారం

నెల్లూరు భక్తవత్సలనగర్‌లోని శ్రీ షిర్డీ సాయిబాబా మందిరంలో ఆనందసాయి ఫౌండేషన్ అధ్యక్షుడు కర్లపూడి కృష్ణ ఆధ్వర్యంలో ఈనెల 12న శ్రీసాయి విశిష్ట ఉగాది పురస్కారాలను ప్రదానం చేశారు. సాయిబాబా భక్తి గీతాలను ఆలపించే గాయకులు కోట ప్రకాశం, సుంకర వెంకటరమణ, సోమిశెట్టి పాండురంగ విఠల్, వై.శేషగిరీశం, కోట రామ్మోహన్, మన్నెం బుజ్జయ్య, ఐ.నాగరాజ గురుస్వామి, పడవల శ్రీనివాసులు, చేపూరి శ్రీనివాసులు, జి.శ్రీనివాసకుమార్‌లు పురస్కారాలందుకున్నవారిలో ఉన్నారు. అల్లం రమణయ్య, మధుసాయి చేతుల మీదుగా ఈ పురస్కారాలు అందజేశారు. సాయిబాబా మందిరం మేనేజర్ సుబ్బారావు, గురునాథం పర్యవేక్షించారు.

## సంప్రదాయాలకు ప్రతీక.. ఉగాది

తెలుగువారి సంప్రదాయాలకు, తెలుగువారి వైభవానికి ఉగాది చిహ్నమని అల్లూరి సీతారామరాజు వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షురాలు రమాదేవి అన్నారు. ఉగాది పండుగను పురస్కరించుకుని ఈనెల 12న నెల్లూరులోని ఇరుకళలమ్మ దేవాలయంలో ఆమె పలువురు మహిళలను సత్కరించి వాయనాలు అందచేశారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు జయప్రకాష్, ఇఓ ప్రసాద్, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

## ఆరోగ్యంపై అవగాహన సదస్సు

నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియం వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 'యోగా-ఆరోగ్యం' అనే అంశంపై వాకర్స్‌కు అవగాహన కార్యక్రమాన్ని ఈనెల 11న స్టేడియంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖ యోగా గురువు సనత్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ కరోనా వేగంగా విస్తరిస్తోందని, ఈ వ్యాధి నివారణకు యోగా ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. క్రియ యోగా చేయడం ద్వారా శరీరంలో ఆక్సిజన్ శాతం పెరిగి ఊపిరితిత్తులు బలపడి వ్యాధిని నిరోధించవచ్చని సూచించారు. వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బాసం శేషగిరిరావు, కార్యదర్శి చింతాప్రసాద్, కోశాధికారి తుంగా సుబ్బరామిరెడ్డి, కిలారి తిరుపతినాయుడు, రాఘవరెడ్డి, రాఘవేంద్రరెడ్డి, డాక్టర్ అంకిరెడ్డి, గోపీనాథ్, నరేంద్రరెడ్డి, ఓబుల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# బడుగు వర్గాలకు వైకాపాయే అండ

## మంత్రులు అనిల్, అప్పలరాజు, ఆదిమూలపు సురేష్



బడుగు బలహీనవర్గాల ప్రజల అభ్యున్నతికి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నిరంతరం కృషిచేస్తున్నారని, మహాత్మా జ్యోతిరావ్ పూలే ఆశయాల బాటలో నడుస్తూ సిఎం జగన్ ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనార్టీల అభివృద్ధికి ఎంతో ప్రాధాన్యత ఇస్తూ వారికి అన్నివిధాలుగా అండదండలందిస్తున్నారని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి మంత్రి డాక్టర్ అనిల్, మత్స్య పశుసంవర్ధకశాఖల మంత్రి సీదిరి అప్పలరాజు, విద్యాశాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ అన్నారు. ఈనెల 11న జ్యోతిరావ్ పూలే జయంతి సందర్భంగా నెల్లూరు మినీబైపాస్‌రోడ్డులో ఉన్న పూలే విగ్రహానికి మంత్రులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేదల కోసం వైఎస్ జగన్ ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి అమలుచేస్తున్నారని వివరించారు. ఈ కార్యక్రమంలో మాజీఎమ్మెల్యే బీద మస్తాన్ రావు, విజయ డెయిరీ ఛైర్మెన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, ఆఫ్కాప్ ఛైర్మెన్ కొండూరు అనిల్‌బాబు, జంగం కార్పొరేషన్ ఛైర్మెన్ వావిలేటి ప్రసన్న తదితరులు పాల్గొన్నారు. అనంతరం నగరంలోని వైకాపా కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో విద్యాశాఖ మంత్రి ఆదిమూలపు సురేష్, సర్వేపల్లి ఎమ్మెల్యే కాకాణి గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రం అభ్యున్నతికి ముఖ్యమంత్రి జగన్ చేస్తున్న కార్యక్రమాలను, ప్రజల కోసం చేపట్టిన పథకాలను వివరించారు. ఈ కార్యక్రమంలో పెనమలూరు ఎమ్మెల్యే పార్థసారధి, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, ఆళ్ళగడ్డ ఎమ్మెల్యే గంగుల బ్రిజేందర్‌రెడ్డి, ఎమ్మెల్సీ గంగుల ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొని మహాత్మా జ్యోతిరావ్ పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

### ఉప ఎన్నిక ఫిర్యాదుల కోసం..

## నెల్లూరులో కంట్రోల్‌రూమ్

తిరుపతి లోక్‌సభ స్థానానికి ఈనెల 17న ఉప ఎన్నిక జరగనున్న నేపథ్యంలో ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనలపై ఫిర్యాదులు స్వీకరించేందుకు నెల్లూరులో కంట్రోల్‌రూమ్ ఏర్పాటుచేసినట్లు జిల్లా పరిశ్రమల కేంద్రం మేనేజర్, కంట్రోల్ రూమ్ నోడల్ అధికారి ఎన్ఎస్ఆర్‌సిఎం ప్రసాద్ ఈనెల 11న ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఫిర్యాదులను 0861-233 6499. లేదా 1950 నెంబర్లకు ఫోన్ చేసి తెలపవచ్చని, ఆ ఫిర్యాదులను వెంటనే పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

### గొప్పలు చెప్పుకోవడం తప్ప..

# అభివృద్ధి ఏదీ?..

### వైకాపాపై చంద్రబాబు విమర్శ



వైకాపా వారు గొప్పలు చెప్పుకోవడం తప్ప రాష్ట్రాభివృద్ధికి చేసిందేమీ లేదని, టిడిపి హయాంలోనే రాష్ట్రం అభివృద్ధి జరిగిందని మాజీ ముఖ్యమంత్రి, తెలుగుదేశం నేత చంద్రబాబునాయుడు చెప్పుకొచ్చారు. తిరుపతి ఉప ఎన్నిక ప్రచారంలో భాగంగా ఆయన నెల్లూరుజిల్లాలో పలుచోట్ల సభలు పెట్టి టిడిపి చేసిన గొప్పలన్నీ చెప్పారు. రాష్ట్రంలోని అనేక అభివృద్ధి పనులు జరిగిందంతా తమ పాలనలోనేనన్నారు. వైకాపా అధికారంలోకి వచ్చాక బడుగు బలహీన వర్గాల అభివృద్ధికి ఏంచేశారంటూ ఆయన ప్రశ్నించారు. టిడిపికి వెనుకబడిన వర్గాలే వెన్నెముక అన్నారు. రెండేళ్ళ వైకాపా పాలనలో రాష్ట్రం అప్పుల పాలైంది తప్ప అభివృద్ధి లేదన్నారు. ఎన్టీఆర్ కృషితోనే తెలుగుగంగ వచ్చిందని, ఎన్నో పరిశ్రమలు తీసుకొచ్చి రాష్ట్రాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేయడం టిడిపి హయాంలోనే జరిగిందని చెప్పారు. నిరుద్యోగ భృతి, అన్న క్యాంటీన్, పింఛన్లు అన్నీ టిడిపి హయాంలోనివేనని అన్నారు. వైకాపా వారు ప్రతిపక్ష నాయకులపై దాడులు చేయడం, దౌర్జన్యాలకు పాల్పడడం వంటివి పెరిగాయని, టిడిపి అలాంటివాటిని చూసి భయపడదని, తమ కార్యకర్తలు, నాయకులకు ఎల్లప్పుడూ అండగా ఉంటామని అన్నారు. ప్రజల కోసం సేవాభావంతో రాజకీయాలు చేయాలే తప్ప, వలంటీర్లు, పోలీసులతో ప్రజలను భయభ్రాంతులను చేయడానికి కాదన్నారు. నియంతలకి పట్టిన గతే జగన్‌కి కూడా పడుతుందంటూ శాపనార్థాలు పెట్టారు. వైకాపా పతనం ప్రారంభమైందని, ప్రజల్లో ఆ పార్టీకి వ్యతిరేక గాలులు వీస్తున్నాయని, తిరుపతి నుంచి పోటీ చేస్తున్న టిడిపి అభ్యర్థి పనబాక లక్ష్మిని గెలిపించి వైకాపాకు ప్రజలు గుణపాఠం చెప్పాలని అన్నారు. ఈ సందర్భంగా ఆయన జిల్లాలోని పలువురు నేతలను కలుసుకున్నారు. నెల్లూరు నగరంలోనూ పలువురు నాయకుల ఇళ్లకు వెళ్ళి పార్టీ గెలుపుకు సహకరించాలని కోరారు. ఆయా ప్రాంతాల్లో ఆయనవెంట స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రంజాన్ మాసం.. ప్రారంభం

ఆకాశంలో నెలవంక దర్శనమివ్వడంతో పవిత్రమైన రంజాన్ మాసం ఈనెల 13 నుంచి ప్రారంభమైంది. దీంతో ముస్లిమ్ మతపెద్దల సూచనలతో ముస్లిమ్ సోదరులందరూ ఎంతో ఆనందంతో ఈ పండుగను జరుపుకోనున్నారు. ఈ సందర్భంగా నెల్లూరులోని పలు ప్రాంతాల్లో ముస్లిం సోదరులు మిఠాయిలతో పాటు ఆనందం పంచుకున్నారు.

### అడవులు అగ్నికి

## మాడిపోకుండా జాగ్రత్త

### - సిబ్బందికి డిఎఫ్ఓ షణ్ముఖ కుమార్ సూచన

ఎండలు మండిపోతున్న దృష్ట్యా జిల్లాలో ఎక్కడా అడవుల్లో అగ్గి రాజుకోకుండా చూడాలని, అటవీప్రాంతాల్లోని ప్రజలకు ఈ ప్రమాదాలపై అవగాహన కల్పించి అగ్నికి అడవులు ఆహుతికాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా అటవీశాఖ అధికారి సంబంధిత అధికారులు, సిబ్బందికి సూచించారు. ఇటీవల ఆయన ఈ అంశంపై సమీక్షా సమావేశం పెట్టి కొంతమంది ఆకతాయిల చర్యల వల్ల కూడా అడవుల్లో అగ్నిప్రమాదాలు జరుగుతున్నాయని, వారిని ఓ కంట కనిపెడుతుండాలని చెప్పారు. అడవుల్లో ఎలాంటి అసాంఘిక కార్యక్రమాలు జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. అడవుల సంరక్షణ పట్ల అందరూ బాధ్యతగా మెలగాలన్నారు. ఈ సమావేశంలో అటవీశాఖ రేంజ్ అధికారి తుమ్మల ఉమామహేశ్వరరెడ్డి, అధికారులు శ్రీనివాసులు, ఖాజారసూల్ రవీంద్ర, ప్రసాద్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

### హామీలను ఏడాదిలోనే నెరవేర్చిన

# ఏకైక సిఎం జగన్

### - టిటిడి బోర్డు ఛైర్మెన్ వైవి సుబ్బారెడ్డి



పాదయాత్రలో ప్రజలకు ఇచ్చిన హామీలన్నిటిని ఏడాదిలోనే నెరవేర్చిన ఏకైక సిఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని, రాష్ట్ర ప్రజల కోసం సిఎం ఎన్నో రకాలైన సంక్షేమ పథకాలను, మరోవైపు అభివృద్ధి కార్యక్రమాలను కనీవినీ ఎరుగని విధంగా చేపట్టి సిఎం జగన్ రాష్ట్ర ప్రజలందరి మన్ననలు అందుకుంటున్నారని వైకాపా నేత, టిటిడి బోర్డు ఛైర్మెన్ వైవి సుబ్బారెడ్డి అన్నారు. తిరుపతి ఉప ఎన్నిక సందర్భంగా ఆయన ఈనెల 11న సూళ్ళూరుపేటలో ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య సారధ్యంలో జరిగిన ర్యాలీలో మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేనివిధంగా అమ్మఒడి, రైతు భరోసా, ఆరోగ్యశ్రీ, నాడు-నేడు వంటి పథకాలను చేపట్టింది ఒక్క సిఎం జగనేనన్నారు. చంద్రబాబు కుల రాజకీయాలు చేస్తుంటే, బీజేపీ మత రాజకీయాలు చేస్తూ.. ప్రజలను మభ్యపెట్టాలని చూస్తున్నారని, వాళ్ళ మాయమాటలను నమ్మే పరిస్థితుల్లో ప్రజలు లేరని ఆయన అన్నారు. చంద్రబాబు సొంత జిల్లాలోనే టిడిపికి దిక్కులేని పరిస్థితి ఏర్పడిందని, ఈ ఉపఎన్నికల్లో వైసిపిని ఓడించాలని చంద్రబాబు చెప్పడం హాస్యాస్పదంగా ఉందని చెప్పారు. ఈ ఎన్నికల్లో వైకాపా అభ్యర్థి గురుమూర్తిని అఖండ మెజార్టీతో గెలిపించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మాట్లాడుతూ స్థానిక ఎన్నికల్లో వైకాపా విజయదుందుభి మోగించిందని, చంద్రబాబు ఇప్పుడు ఏ ముఖం పెట్టుకుని ఓట్లడగడానికి వస్తున్నాడని ఎద్దేవా చేశారు. ప్రత్యేక హోదాను ఎవరు తాకట్టుపెట్టారో ప్రజలందరికీ తెలుసన్నారు. ఈ ర్యాలీలో వైకాపా అభ్యర్థి గురుమూర్తితో పాటు ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి, ఎంపీలు గోరంట్ల మాధవ్, నందిగామ సురేష్, సూళ్ళూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య తదితరులు పాల్గొని మాట్లాడారు.

# కేసులకు భయపడేది లేదు

### - మాజీమంత్రి దేవినేని ఉమా




ప్రజా సంక్షేమం, అభివృద్ధి విషయాలకు సంబంధించి జరుగుతున్న అవినీతిని తాను ప్రతిపక్ష హోదాలో ప్రశ్నిస్తే తన గొంతునొక్కేందుకు అధికారపార్టీ వారు తనపై కేసులు పెడుతున్నారని, వారు ఎన్ని కేసులు బనాయించినా భయపడేది లేదని, వాటిని ఎదుర్కొనేందుకు న్యాయపోరాటం చేస్తామని మాజీమంత్రి, టిడిపి నాయకుడు దేవినేని ఉమా అన్నారు. ఈనెల 12న నెల్లూరులోని టిడిపి జిల్లా కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైకాపా మంత్రులు, ఎమ్మెల్యేలు తనపై కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో జరుగుతున్న భారీ నీటిపారుదల ప్రాజెక్టుల పనుల్లో భారీగా అవినీతి జరుగుతోందని ఆయన విమర్శించారు. ప్రజలు అంతా వైకాపా తీరును గమనిస్తున్నారని, త్వరలోనే ఆ పార్టీకి తగు గుణపాఠం చెప్తారని అన్నారు. ఈ సమావేశంలో టిడిపి జిల్లా కార్యదర్శి చేజర్ల వెంకటేశ్వర్లురెడ్డి, నాయకుడు సురేంద్ర బాబు తదితరులు పాల్గొన్నారు.

అధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు



# సింహాలతో... పులులతో పోలికలెందుకు!?

'సింహం సింగిల్‌గానే వస్తుంది... పందులు గుంపులుగా వస్తయ్...!'

ఈ మధ్యకాలంలో జనంలో బాగా పాపులర్ అయిన డైలాగ్ ఇది. తమ నాయకుల వీరత్వాన్ని ఆకాశానికి ఎత్తేయడానికి అనుచరులు ఎంచుకునే పొగడ్తల మార్గం ఇది. అలాగే... శక్తివంతంగా కనిపించే నాయకులను 'టైగర్' అంటూ పెద్దపులితో పోల్చుకుంటుంటారు. అనుచరులకు 'అదో తుత్తి'.

అలాగే, బహిరంగ సభలకు విచ్చేసే తమ ప్రియతమ నేతలకు పొడవాటి ఖడ్గం ఇచ్చి... గాలిలో ఊపమంటారు. నాయకులు కూడా తమ ప్రియమైన అనుచరులను నిరాశ పరచలేక వారు అందచేసే కరవాలాన్ని కాసేపు గాలిలో తిప్పి, సభికులను ఆనందపర్చుతుంటారు. ఎవరినీ పొడవడం కుదరదు గనుక, ఆ ఖడ్గాన్ని తిరిగి అనుచరులకు అప్పగించేస్తారు.



నిజానికి, ఈ మూడూ మన జీవన విధానానికి విరుద్ధమైనవి. సింహం గానీ, పులి గానీ మనమధ్య ఉండే జంతువులు కావు. అరణ్యాలలో ఉండే క్రూర జంతువులు. అరణ్యాలలో తారసపడే జంతువుల పీకలు కొరికి, వాటి రక్తం తాగే రక్త పిపాసువులు. వాటికి దయాదాక్షిణ్యాలు ఉండవు. వాటిని చూస్తే, మిగిలిన జంతువులన్నీ ఒకటే పరుగు. ఎందుకంటే ఈ క్రూర జంతువుల కంటే అవి మానసికంగానూ, శరీర నిర్మాణ పరంగానూ ఎంతో బలహీనమైనవి. దుర్బలమైనవి.




జంతువులే కాదు. మనుషులు కనపడినా... ఈ సింహాలు, పులులూ వదలవు. సమీప అడవిలోకి ఈడ్చుకుపోయి... తాపీగా భక్షిస్తాయి. మిగిలిన కళేబరాన్ని అక్కడ పారేసిపోతాయి. నాయకులను అటువంటి క్రూర జంతువులతో పోల్చడమంటే... అవి అడవుల్లో ప్రవర్తిస్తున్నట్లుగానే... ఈ నాయకులు పౌర సమాజంలో ప్రవర్తిస్తారు జాగ్రత్త అని చెప్పడమా! ఈ నేతలతో జాగ్రత్త... ఏమాత్రం ఏమరుపాటుగా ఉన్నా... మీ రక్తం తాగుతారు అని చెప్పడమా? నిజానికి నేతల అనుచరుల భావన అది కాదు. 'మా లీడర్ తిరుగులేని నాయకుడు' అని చెప్పాలనుకోవడం అయివుండవచ్చు.



ఉగాండా అని ఆఫ్రికా ఖండంలో ఒక దేశం ఉంది. దానికి గతంలో ఇడీ అమిన్ అని ఒక నియంత అధ్యక్షుడిగా ఉండేవారు. పరమక్రూరుడు. నరరూప రాక్షసుడు. తన ప్రత్యర్థులను కిరాతకంగా చంపించి, వారి రక్తం తాగేవాడు. ఉగాండాలోని మహిళలు, ఇతర పౌరులపై అతని అకృత్యాలు చదవడానికి కూడా భయం వేస్తుంది. ఒళ్ళు జలదరిస్తుంది.

అటువంటి వారికి ఈ సింహాలు, టైగర్‌ల పోలికలు అచ్చు గుద్దినట్టు సరిపోతాయి. అడవుల్లో అవి చేసే పనులు... పౌర సమాజంలో ఇటువంటి వారు చేసే పనులకు పెద్ద తేడా ఉండదు కనుక. అంతే తప్ప, ఒక రాజశేఖరరెడ్డో... ఒక జగనో... ఒక షర్మిలో టైగరూ కాదు. సింహమూ కాదు. ముంబైలో మారణహోమం సృష్టించిన పాక్ జాతీయుడు ఒక టైగర్. దావూద్ ఇబ్రహీం ఒక రక్తం మరిగిన పులి. పులులు... సింహాలతో ఎవరినైనా పోల్చాలి అనుకుంటే అటువంటి నరహంతకులను పోల్చాలి. నరరూప రాక్షసులను పోల్చాలి.

ఇప్పుడు మనం 21వ శతాబ్దంలో ఉన్నాం. అత్యంత ఆధునిక, నాగరిక, ప్రజాస్వామికమని అనుకునే సమాజంలో బతుకుతున్నాం. ఒకరిని ఒకరం 'మీరు' అని సంబోధించుకునే సమాజంలో ఉన్నాం. సామాజికంగా ఎవరికి ఎవరైనా ఎక్కువ.. తక్కువలు లేని సమ సమాజంలో ఉన్నాం.

ఇందులో ఒకరు పులి... ఒకరు లేడి అన్న పాయింటే లేదు. ఒకవేళ ఎవరైనా... పులి, సింహం బుద్ధులు ప్రదర్శిస్తే... పౌర సమాజం పట్టుకుని దొరికిన పులి, సింహాలను శిక్షించినట్టే శిక్షిస్తుంది.

అందువల్ల, ఎవరు... ఎవరిని పులులు, సింహాలతో పోల్చినా అది సరి అయిన పోలికైతే కాదు. చివరికి ముఖ్యమంత్రి జగన్‌పై ఢిల్లీ నుంచి ఒంటికాలితో లేస్తున్న వైసీపీ ఎంపీ రఘురామ కృష్ణంరాజు కూడా ఈమధ్య ఈ పోలికను తనకే ఆపాదించుకున్నారు, 'సింహం సింగిల్‌గా వస్తుంది. పందులే గుంపులుగా వస్తాయి' అని.

వై.ఎస్.రాజశేఖరరెడ్డి కుమార్తె, షర్మిల ఇటీవల ఖమ్మం వెళ్ళినప్పుడు కూడా 'సింహం సింగిల్‌గా....' అన్న డైలాగ్ వినబడింది.

ఆవిడ సింహంలా ప్రవర్తించవలసిన పని లేదు. ఒక మనసున్న మనిషిలా... ఒక తల్లిలా... ఒక చెల్లిలా... ఒక అక్కలా తెలంగాణ వాసులకు ఆసరాగా ఉంటే చాలు. ఎందుకంటే, ప్రజల రక్తాన్ని తాగే పులులూ, సింహాలూ తెలంగాణలో చాలానే ఉన్నాయి... షర్మిల వాటితో జత కలవడం దేనికి?

మనిషిని అసలు జంతువులతో పోల్చడమే ఓ ఆటవిక ప్రవృత్తి. ఓ అరాచక భావన. పోల్చుకోడానికి మనకు నేతల కొరత ఏమీ లేదు. ఒక భగత్‌సింగ్‌తో, ఒక నేతాజీ సుభాష్ చంద్రబోస్‌తో, ఒక లాల్ బహదూర్‌శాస్త్రి, ఒక ప్రకాశం పంతులు గారితో పోల్చుకోవచ్చు. మహిళ అయితే రాణీ రుద్రమదేవితో, ఝాన్సీ లక్ష్మీబాయ్‌తో పోల్చుకోవచ్చు. వీరందరూ... నీతి, నిజాయతీలకు..., ముక్కుసూటి తనానికి, ధైర్య సాహసాలకు సజీవ చిహ్నాలు.

కానీ, వారితో పోల్చుకోగలిగిన నిజాయతీ గానీ, ముక్కు సూటితనం గానీ, ధైర్య సాహసాలు గానీ, స్వచ్ఛ నడవడిక గానీ లేనప్పుడు వారితో తమ అభిమాన నేతలను పోల్చడం కుదరక ఏదో ఒక విధంగా పోలిక తేకుండా ఉండలేకా చివరకు పులులు, సింహాలతో వారి అనుచరులు పోల్చుతూ ఉంటారు. వారి ప్రత్యర్థులదీ అదే బాణీ. పిల్లులు, నక్కలూ, తోడేళ్లతో పోల్చి గేలి చేస్తుంటారు.

అంటే.. అటూ, ఇటూ అడవి జంతువులతో పోల్చి ఆనందపడేవారే తప్ప మనుషులతో పోల్చేవారే కనపడడం లేదు. ఇలా అయితే, ఈ 'అనుచరులు' ఇంకా ఆటవిక సమాజంలో నివసిస్తున్నట్టే లెక్క. కాకపోతే... వారు అడవుల్లో కాక మన మధ్యనే తిరుగుతుంటారు. వారు కొంచెం అప్డేట్ అయితే బావుణ్ణు.

- భోగాది వేంకట రాయుడు
bhogadirayudu2152@gmail.com




## గురుమూర్తికి భారీ మెజార్టీ ఇవ్వండి

**- వైకాపా నాయకులు**



తిరుపతి పార్లమెంట్ ఉపఎన్నిక సందర్భంగా వైకాపా ఎంపీ అభ్యర్థి గురుమూర్తికి మద్దతుగా చిల్లకూరు వైకాపా నాయకులు ఇటీవల ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో రాష్ట్ర మంత్రులు అనిల్‌కుమార్‌యాదవ్, మత్స్యశాఖ మంత్రి అప్పలరాజు, రాప్తాడు ఎమ్మెల్యే టి.ప్రకాష్‌రెడ్డి, గూడూరు ఎమ్మెల్యే వి.వరప్రసాద్, మేరిగ మురళి, వైకాపా నాయకులు కుమారస్వామిరెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, పాపారెడ్డి మనోజ్‌రెడ్డి తదితర నాయకులు పాల్గొన్నారు. భారీ సంఖ్యలో ప్రజలు హాజరయ్యారు. ఈ సందర్భంగా వైకాపా నాయకులు మాట్లాడుతూ వైకాపా ఎంపీ అభ్యర్థి డా.గురుమూర్తిని భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. కాగా, గూడూరు ఎమ్మెల్యే వరప్రసాద్‌రావుకు ఈ సభలో సరైన ప్రాధాన్యత దక్కక పోవడం కొసమెరుపు.

## మీ ఓటు.. జగన్‌కు కనువిప్పు కావాలి

**- మాజీ సిఎం చంద్రబాబునాయుడు**



అధికారంలోకి వచ్చిన గత రెండేళ్లలో వైయస్సార్ కాంగ్రెస్ అనేక భారాలతో పేదల నడ్డి విరిచిందని, దేశంలో కరోనా వైరస్ కంటే జగన్ వైరస్ అత్యంత ప్రమాదకరంగా తయారైందని మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు విమర్శించారు. తిరుపతి లోక్‌సభ ఉప ఎన్నికల ప్రచారంలో భాగంగా ఈ నెల 13వ తేదీ రాత్రి గూడూరు పట్టణంలో రోడ్‌షోలో ఆయన ప్రజలనుద్దేశించి మాట్లాడుతూ తాను నలభై ఏళ్లు ఒక్క రూపాయి ఆశించకుండా నిప్పులా బతికానని, నాపై అక్రమ కేసులు పెడుతున్నారని, ఎందుకు కేసులు పెట్టారో కూడా చెప్పడం లేదన్నారు. తిరుపతి ఎన్నికల్లో మీ ఓటు కనువిప్పు కావాలని పిలుపునిచ్చారు. ఎన్నికల్లో అక్రమాలను ప్రశ్నించేందుకు వస్తే పదిగంటలు ఎయిర్‌పోర్ట్‌లో కూర్చోబెట్టారన్నారు. లోక్‌సభ ఉప ఎన్నికల్లో ఫ్యాన్‌ను ఓడించాలని ఆయన పిలుపునిచ్చారు

## ప్రపంచం గర్వించదగ్గ ఇంజనీర్ మోక్షగుండం



గూడూరు పంచాయతీ రాజ్ డివిజన్ కార్యాలయంలో పంచాయతీరాజ్ అధికారులు మోక్షగుండం విశ్వేశ్వరయ్య వర్ధంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పంచాయతీ రాజ్ ఇఇ కాంతారావు మాట్లాడుతూ ప్రపంచం గర్వించదగ్గ ఇంజనీర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య అని, ఆయన ఎన్నో ఉన్నత పదవులు అలంకరించి ఆదర్శంగా నిలిచారన్నారు. ఆంధ్రప్రదేశ్ డిప్లొమో ఇంజనీర్ల రాష్ట్ర గౌరవ అధ్యక్షులు షేక్ రియాజ్ అహ్మద్ మాట్లాడుతూ యువ ఇంజనీర్లు మోక్షగుండంను ఆదర్శంగా తీసుకొని రాష్ట్ర, దేశాభివృద్ధికి తోడ్పడాలని తెలిపారు. త్వరలో మోక్షగుండం విగ్రహాన్ని గూడూరు పంచాయతీ డివిజన్ కార్యాలయంలో ఏర్పాటు చేసేందుకు కృషిచేస్తున్నట్లు తెలిపారు. జిల్లా పంచాయతీరాజ్ ఇంజనీర్ల అధ్యక్షుడు టి.శ్రీనివాసులురెడ్డి, పంచాయతీరాజ్ డి.ఈఈలు కె.రవీంద్రకుమార్, కృష్ణబాబు, ఏ.ఈఈలు ఇలియజ్ అహ్మద్, జి.సి వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.

## 'ప్రగతి ఉగాది' సత్కారాలు



తెలుగు నూతన సంవత్సరాది శ్రీ ప్లవ నామ ఉగాది పర్వదినం సందర్భంగా ఈ నెల 12వ తేదీ శ్రీ వీరభద్రస్వామి గుడిలో అయిదుగురు పూజారి దంపతులకు ప్రగతి సేవా సంస్థ "ప్రగతి ఉగాది సత్కారం"తో ఘనంగా సత్కరించింది. గట్టుపల్లి శ్రీరామమూర్తి – శ్రీమతి లక్ష్మీ, చందలూరు రత్నాకర స్వామి – శ్రీమతి సీతారావమ్మ, కురుచర్లపాటి శివకుమార్ – శ్రీమతి శారద, వేదాంతం రఘునాథ చక్రవర్తి – శ్రీమతి రాధ, కోవూరు విజయభాస్కర్ స్వామి – శ్రీమతి గాయత్రి దంపతులకు మొగరాల నాగేశ్వరరావు చేతుల మీదగా ఈ సత్కారాలు జరిగాయి. ప్రగతి సేవ ప్రతినిధులు చంద్రశేఖర్, బండి ధనంజయరెడ్డి, జి.చంద్రశేఖర్, కాటూరు శ్రీనివాసులు, శ్రీ చైతన్య శ్రీనివాసులు, కోట కృష్ణ, డివిఎస్ఆర్ సుధీర్, గ్రానైట్ ప్రభాకర్, వాన్‌షాప్ రాము, కుమార్, కో–ఆర్డినేటర్ సతీష్, టీవీ రవి, నాగరాజు, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు



## డా. అంబేద్కర్ జయంతి

భారతరత్న డా. బాబా సాహెబ్ అంబేద్కర్ 130వ జయంతి సందర్భంగా ప్రముఖ న్యాయవాది డాక్టర్ అరవ పార్వతయ్య నివాసంలో ఈ నెల 14న అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కండలేరు డ్యాం డి.ఇ. ఎస్.బాబయ్య ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ భారత పౌరులకు అంబేద్కర్ కల్పించిన ఓటు హక్కును సద్వినియోగం చేసుకుని మంచి నాయకులను ఎన్నుకోవాలని పిలుపునిచ్చారు.

## గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు



గూడూరు రూరల్ మండలం నెల్లటూరు గ్రామంలో వెలసివున్న శ్రీ గంగమ్మతల్లి అమ్మవారి ఆలయంలో ఉగాది పండుగ పర్వదినాన్ని పురస్కరించుకుని అర్చకులు అశోక్ స్వామి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారు కుంకుమ అలంకారంలో దర్శనమిచ్చారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అర్చకులు అశోక్ స్వామి భక్తులకు ఉగాది పచ్చడి ప్రసాదాలను అందజేశారు.

# రాజధానిని వైకాపా ఎడారిగా మార్చింది

## బిజెపి నేత రావెల విమర్శ

అమరావతి కోసం కేంద్రప్రభుత్వం ఏడువేల కోట్ల రూపాయలు ఇచ్చినా వైకాపా ప్రభుత్వం రాజధానిని ఎడారిగా మార్చిందని బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు రావెల కిషోర్‌బాబు విమర్శించారు. ఈనెల 11న ఆయన నెల్లూరులోని బిజెపి కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ వైకాపాపై విమర్శలు గుప్పించారు. రాష్ట్రంలో అరాచక పాలన కొనసాగుతోందన్నారు. రాష్ట్రాభివృద్ధి ఒక్క బిజెపితో మాత్రమే సాధ్యమవుతుందన్నారు. తిరుపతి ఉప ఎన్నికల్లో బిజెపి అభ్యర్థి రత్నప్రభను గెలిపించాలని కోరారు. ఈ సమావేశంలో బిజెపి పార్లమెంట్ నియోజకవర్గం అధ్యక్షుడు గుండ్లపల్లి భరత్‌కుమార్‌యాదవ్, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కాకు విజయలక్ష్మి, ఓబిసి మోర్చా జిల్లా అధ్యక్షుడు రాధాకృష్ణ, దాసరి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# బిజెపివి ప్రజా వ్యతిరేక విధానాలు

## - సిపిఎం నేత మధు

బిజెపి విధానాలన్నీ ప్రజా వ్యతిరేక విధానాలని, ఆ పార్టీ అధికారంలోకి వచ్చాక దేశంలోని ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేట్ పరం చేస్తోందని, ప్రజానుకూల చట్టాలను నిర్వీర్యం చేస్తోందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి మధు విమర్శించారు. తిరుపతి ఉప ఎన్నిక సందర్భంగా ఈనెల 11న ఆయన సూళ్ళూరుపేటలో సిపిఎం అభ్యర్థి యాదగిరితో కలసి రోడ్‌షో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా కల్పిస్తామని చెప్పిన బిజెపి ఆ తర్వాత మాట మార్చిందని, ఆ పార్టీని నిలదీసే పరిస్థితి రాష్ట్ర ప్రభుత్వానికి లేదని అన్నారు. ఈ ఎన్నికల్లో సిపిఎం అభ్యర్థి యాదగిరిని గెలిపించాలని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ ర్యాలీలో డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి రాములు తదితరులు పాల్గొన్నారు.

# మీ సేవలు అపూర్వం

## హాకీ కోచ్ నారాయణరావు సన్మానసభలో వక్తలు

హాకీ క్రీడాకారునిగా, కోచ్‌గా, విశ్రాంత డిఎస్‌డిఓగా దాదాపు అరవైఏళ్ళకు పైగా మీరు చేసిన సేవలు ఎంతో అపూర్వమని వక్తలు వాదనాల నారాయణరావును కొనియాడారు. ఈనెల 11న నెల్లూరులోని పలువురు క్రీడాకారులు, ప్రముఖులు ఆయన్ను ఎంతో ఆత్మీయంగా సన్మానించారు. హాకీ క్రీడకు ఆయనందించిన సహకారాన్ని మరువలేమన్నారు. ఎన్‌సిఎస్‌ఆర్ నెల్లూరు హాకీ అసోసియేషన్ ఆధ్వర్యంలో నగరంలోని ఏసి సుబ్బారెడ్డి స్టేడియంలో జరిగిన ఈ సన్మాన కార్యక్రమంలో డిఎస్‌ఏ చీఫ్ కోచ్ యతిరాజు, రంజీ క్రికెటర్ మలిరెడ్డి కోటారెడ్డి తదితరులు పాల్గొని నారాయణరావును ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా హాకీ ఒన్‌డే టోర్నీలో విజేతలైన క్రీడాకారులకు బహుమతులు అందజేశారు. జిల్లా వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం కార్యదర్శి పి.థామస్‌పీటర్, బాస్కెట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి వాసు, ఖోఖో అసోసియేషన్ కార్యదర్శి గురుప్రసాద్, సీనియర్ ఫుట్‌బాల్ క్రీడాకారుడు డి.సురేంద్ర, ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ కార్యదర్శి వినుకొండ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# 45 ఏళ్ళ పైబడిన వారికి టీకా

కోవిడ్ వైరస్‌ను నిరోధించేందుకు జిల్లా అధికార యంత్రాంగం గట్టి చర్యలు తీసు కుంటోంది. ప్రభుత్వం సూచించిన కార్య క్రమంలో భాగంగా జిల్లాలోని 298 గ్రామ సచివాలయాలు, 59 పట్టణ సచివా లయాల పరిధిలోని మొత్తం 357 కేంద్రాల్లో టీకా మహోత్సవం ఈనెల 14 వరకు ముమ్మరంగా జరిగింది. ఏఎన్ ఎంలు, ఆశ కార్యకర్తలు, వైద్యసిబ్బంది పాల్గొని 45 ఏళ్ళ పైబడిన వారికి టీకాలు వేశారు. ఏఎన్‌ఎంల బృందం ఇంటిం టికీ తిరుగుతూ టీకాపై అవగాహన కల్పిస్తూ, 45 ఏళ్ళు నిండి ఇప్పటివరకు టీకా వేయించుకోని అనేకమందికి టీకా వేశారు. నెల్లూరు నగరంలోని జనార్ధన్‌రెడ్డి కాలనీ, కిసాన్‌నగర్, కోటమిట్ట, వెంగళ రావునగర్, యూకోనగర్, ఎన్టీఆర్‌నగర్, పడారుపల్లి అర్బన్ హెల్త్ సెంటర్లతో పాటు పెద్దాస్పత్రి ప్రసూతి విభాగం వద్ద ఉండే పీపీ యూనిట్ ఆధ్వర్యంలో టీకా కార్యక్రమం పెద్దఎత్తున జరిగింది. నగర సమీపంలోని పరిశ్రమల్లో పనిచేసేవారిని వెతికెతికి మరీ టీకాలు వేశారు.

# మెట్టా పుట్టిన రోజున అన్నదానం

ముత్తుకూరు మండలం వైకాపా కన్వీనర్ మెట్టా విష్ణువర్ధన్‌రెడ్డి పుట్టినరోజు సందర్భంగా ఈనెల 11న నెల్లూరు నగరంలోని గీతామయి ఆశ్రమంలోని వృద్ధులకు అన్నదానం చేశారు. తొలుత వైకాపా నాయకుడు బూదూరు జవహర్‌రెడ్డి కేకును కట్‌చేసి కార్యకర్తలందరికీ పంచిపెట్టారు. అందరూ విష్ణువర్ధన్‌రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు చెప్పారు. వైకాపా నాయకుడు మస్తాన్, మెట్టా యువసేన నాయకుడు హర్ష తదితరులు పాల్గొన్నారు.

# నేత్రపర్వం.. పెంచలస్వామి పెళ్ళివేడుక

జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలో కొలువైన శ్రీ పెనుశిల లక్ష్మీ నరసింహస్వామికి ఈనెల10న కల్యాణోత్సవం నేత్రపర్వంగా జరిగింది. స్వామివారి నిత్యకల్యాణ మండపంలో ఈ ఉత్సవం వేడుకగా నిర్వహించారు. తొలుత స్వామివారిని, అమ్మవార్లను శోభాయమానంగా అలంకరించి శాస్త్రోక్తంగా పూజలు చేసి వేదమంత్రాల మధ్య, మంగళవాయిద్యాల మధ్య కల్యాణోత్సవం నిర్వహించారు. పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివార్లను దర్శించుకున్నారు. ఆలయ సహాయ కమిషనర్ జె.వెంకటసుబ్బయ్య, ఆలయ సిబ్బంది పర్యవేక్షణలో ఈ ఉత్సవం జరిగింది. అనంతరం భక్తులందరికీ అన్నప్రసాద వితరణ చేశారు.

## పెంచలకోనలో నిత్యాన్నదానానికి లక్ష విరాళం

పెంచలకోనలో వెలసిన శ్రీ పెనుశిల లక్ష్మీనరసింహస్వామి దేవాలయానికి వచ్చే భక్తులకు నిత్యాన్నదాన పథకం ద్వారా భోజనం అందించేందుకు నెల్లూరుకు చెందిన డాక్టర్ ఎం.వి.నారాయణరెడ్డి, నిర్మల దంపతులు ఈనెల11న ఆ పథకానికి లక్ష రూపా యలు విరాళంగా అందించినట్లు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వెంకటసుబ్బయ్య తెలిపారు.

# పోలేరమ్మతల్లికి పొంగళ్ళు

కొడవలూరులోని పోలేరమ్మ అమ్మవారి ఆలయానికి ఈనెల11న భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చి పొంగళ్ళుపెట్టి నైవేద్యంగా సమర్పించుకున్నారు. అమ్మవారి గుడి ప్రాంతం భక్తజన కోలాహలంతో నిండిపోయింది. తొలుత అమ్మవారిని నేత్రపర్వంగా అలంకరించి పూజలు చేశారు. గ్రామప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని ప్రార్థిస్తూ పోలేరమ్మ అమ్మవారికి పొంగళ్ళు సమర్పించుకున్నామని భక్తులు తెలిపారు.

# నవలా రచయిత్రి పూజితకు..తెలుగుతేజం అవార్డు



నెల్లూరు నగరానికి చెందిన ప్రముఖ నవలా రచయిత్రి ఎన్.పూజితకు ఎంతో విశిష్టమైన తెలుగుతేజం జాతీయ అవార్డు లభించింది. మాజీ ప్రధాని పివి నరసింహారావు శతజయంతి ఉత్సవాల్లో భాగంగా ఈనెల 9వ తేది నిర్వహించిన వేడుకల్లో ఈ అవార్డును ఆమెకు ప్రదానం చేస్తున్నట్లు ప్రకటించారు. ఆ సమాచారాన్ని కమిటీ కన్వీనర్ వెంకట రమణగుప్తా, గౌరవ సలహాదారు వేణుగోపాల్ తనకు తెలియజేసినట్లు పూజిత పేర్కొన్నారు.

# రాహుల్ ప్రధానైతే..రాష్ట్రానికి ప్రత్యేక హోదా

## - కాంగ్రెస్ నాయకుడు శైలజానాథ్

రాహుల్‌గాంధీ ప్రధానమంత్రి అయితే రాష్ట్రానికి ప్రత్యేక హోదా తీసుకువస్తామని పిసిసి అధ్యక్షుడు శైలజానాథ్ అన్నారు. తిరుపతి ఉప ఎన్నిక సందర్భంగా ఆయన ఈనెల 11న గూడూరులో కాంగ్రెస్ నాయకులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. వైకాపా పాలనలో రాష్ట్రాభివృద్ధికి చేసిందేమీ లేదన్నారు. దుగరాజపట్నం పోర్టు లేదు..మన్నవరం భెల్ లేదు..ఏమీ లేదు, రాష్ట్రానికి ఒరిగిందేమీ లేదని విమర్శించారు. జగన్‌రెడ్డి పార్టీ అసమర్ధ పార్టీ అని దుయ్యబట్టారు. ఆయన వెంట స్థానిక కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# 'గురువులకు గుడి'..శ్రీ వేదాంత దేశికర్ సన్నిధి

***భగవంతునికే కాక, నిరంతరం ఆ భగవంతుని ఆరాధించే పరమ భాగవ తోత్తములు, సద్గురువులకు కూడా గుడులు కట్టి ఆరాధించడమన్నది భారతీయ సనాతన సంప్రదాయం. నెల్లూరు నగరంలోని ప్రఖ్యాతమైన శ్రీ రంగనాథస్వామి దేవాలయానికి అత్యంత సమీపంలోనే ఉన్న చరిత్రాత్మకమైన శ్రీ వేదాంత దేశికర్ సన్నిధి కూడా అలాం టిదే. ఇక్కడ విష్ణుభక్తి పరాయణుడైన వేదాంత దేశికర్‌తో పాటు మరో గురువు.. అహోబిళ పీఠాధిపతి శఠకోప యతీంద్రుల ప్రతిమలు కూడా ఒకే మందిరంలో ఉండి భక్తులందరి పూజ లందుకుంటున్నాయి. 'శ్రీ వేదాంత దేశికర్, శ్రీ ఆదివణ్ శఠకోప యతీంద్ర మహాదేశికర్‌ల సన్నిధి'గా ఈ ఆలయం.. ఎంతో కాలంగా 'గురువుల గుడి'గా నెల్లూరుసీమలో ప్రఖ్యాతమైంది.***

సుప్రసిద్ధ భాగవతోత్తముడు, రంగనాథుని పాదపీఠమే సర్వస్వంగా భావించి ఒక్క ఝాములోనే 'పాదుకా సహస్రం' పేరుతో వెయ్యి శ్లోకాలను సంస్కృతభాషలో అత్యద్భుతంగా వెలయించిన మహా పండితుడు, 'కవితార్కిక సింహ' బిరుదాంకితుడు, శ్రీ వేదాంత దేశికర్‌ల వారు. అదేవిధంగా శఠకోప యతీంద్ర దేశికర్.. అంటే మరెవరో కాదు భగవదారాధనలో 'సంకీర్తనల' వైశిష్ట్యాన్ని అన్నమాచార్యుల వారికి ప్రబోధించిన గురువు ఆయన. అలాంటి యతీంద్ర దేశికర్‌కు కూడా గురువు వేదాంత దేశికర్‌ల వారే. లోకానికి భక్తితత్వాన్ని చాటిచెప్పిన సద్గురువులైన ఈ గురుశిష్యులిద్దరినీ నిత్యం పూజిస్తూ నెల్లూరులో ఆలయం నెలకొల్పడం ఎంతో విశేషం. అంతేకాదు, వీరిరువురూ ఎంతో భక్తితో ఆరాధించే శ్రీ వేంకటేశ్వరస్వామికి కూడా ఈ ఆలయ ప్రాంగణంలోనే కోవెల కట్టడం మరో విశేషం.

## ఆలయ చరిత్ర :


తమిళనాడులోని కంచి వద్ద ఉన్న 'తూప్పుల్' అనే గ్రామంలో క్రీ.శ 1268లో వేదాంత దేశికర్ జన్మించారు. నిరంతర భగవ



వేదాంత దేశికర్







యతీంద్ర దేశికర్



మన దేవాలయాలు 43

దారాధనలో పునీతమైన ఆ మహనీయుడు భగవత్తత్వాన్ని, ప్రత్యేకించి విష్ణు తత్వాన్ని ప్రజలకు బోధిస్తూ తన జీవితాన్నంతా విష్ణుభక్తితో గడిపారు. సుమారు నూట రెండు ఏళ్ళ పాటు జీవించిన వేదాంత దేశికర్ ఆనాటి సమాజంలో భక్తి ఉద్యమానికి సారథిగా పేరొందాడు. భగవత్తత్వాన్ని వివరిస్తూ ఆయన చేసిన రచనలు లక్షలాదిమంది ప్రజలను ఆకట్టుకున్నాయి. దాదాపు 750 ఏళ్ళ క్రితం అటు తమిళనాడు, ఇటు తెలుగునాడుల్లో వైష్ణవ మత సంప్రదాయాన్ని, విష్ణుభక్తి తత్వాన్ని ప్రజలకు తన రచనల ద్వారా, బోధనల ద్వారా ప్రబోధించిన వేదాంత దేశికర్ ఆ కాలంలో ఎంతో సుప్రసిద్ధులు. ఆయన రచించిన 'దయా శతకము'తో పాటు సుమారు వంద గ్రంథాలు, వందలాది స్తోత్రాలు విష్ణుభక్తి తత్వానికి ప్రతీకలుగా నేటికీ అందరి ప్రశంసలందుకుంటున్నాయి. అందుకే కేవలం పండితునిగానే కాక, పరమ భాగవతోత్తమునిగా.. ఆ భగవంతుని అవతార మూర్తిగా వేదాంత దేశికర్‌ను ఎంతో మంది భక్తులు నేటికీ కొలుచుకుంటున్నారు. తమిళనాడులో వడగళ్ సంప్రదాయాన్ని పాటించే దేవస్థానాలన్నిటిలోనూ వేదాంత దేశికర్‌కు ప్రత్యేక గుడులున్నాయి. శ్రీరంగంలోని శ్రీ రంగనాథాలయంలో కూడా వేదాంత దేశికర్ సన్నిధి ఉంది. అదేవిధంగా నెల్లూరులోనూ సుమారు 134సంవత్సరాల క్రితమే నెల్లూరు పెన్నానది ఒడ్డున వెలసివున్న శ్రీ రంగనాథస్వామి దేవాలయానికి ఎదురుగా కేవలం ఓ వంద గజాల దూరంలోనే వేదాంత దేశికర్, యతీంద్ర దేశికర్‌ల ఆలయ నిర్మాణం జరిగింది. అప్పట్లో అహోబిళ మఠం వారు ఈ ఆలయానికి స్థలాన్ని విరాళంగా ఇవ్వగా భక్తులంతా కలసి 1887ప్రాంతంలో ఈ సుందరమైన ఆలయం నిర్మించారని చరిత్ర. శ్రీ వేంకటేశ్వరుడే సర్వస్వంగా భావించి తన సంకీర్తనల సుమాలతో కీర్తించిన అన్నమయ్య ఆ తిరుమలేశుని నందకాంశ సంభూతునిగా ప్రసిద్ధులైతే, శ్రీ వేదాంత దేశికర్ సాక్షాత్తూ ఆ తిరువేంకట నాథుని గంటావతారమూర్తిగా ప్రఖ్యాతి చెందిన విషయం భక్తులందరికీ తెలిసిందే.

## ప్రతి ఏటా ఉత్సవాలు :

ఈ ఆలయంలో ప్రతి ఏటా పురటాశి మాసంలో వేదాంత దేశికర్ జయంతి కన్నులపండువగా జరుగుతుంది. తిరుమలలో శ్రీ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో చివరిరోజైన చక్రస్నానం రోజున ఇక్కడ వేదాంత దేశికర్ జయంతి ఉత్సవాలను నిర్వ హిస్తుంటారు. అదేమాసంలో జ్యేష్ఠ నక్షత్రంలో యతీంద్ర దేశి కర్‌కు కూడా జయంతి ఉత్సవాలు చేస్తుంటారు. 2018లో వేదాంత దేశికర్ 750వ జయంతి మహోత్సవాలు కూడా జరిగాయి. శ్రీ వేంకటేశ్వరుని గంటా స్వరూపంగా అవతరించిన వేదాంత దేశికర్‌ను అర్చిస్తూ, ఈ ఆలయంలో అయిదు టన్నుల గంటామూర్తిని కూడా ఇటీవలే ప్రతిష్ఠించి భక్తులందరికి నేత్ర పర్వం గావించారు. ఆలయ అర్చకులు, నిర్వాహకులు, భక్తులు, దాతలు, ప్రజలందరి సహకారంతో ఈ గురువుల గుడి ఎంతోకాలంగా భక్తులపాలిట పెన్నిధిగా అలరారుతోంది.

## ప్రజల సంక్షేమం కోసం..

# 'నవరత్నాల క్యాలెండర్'

**అధికారంలోకి వచ్చినప్పటినుంచి వైయస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి ఎన్నోరకాల సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అమలుచేస్తున్న విషయం అందరికీ తెలిసిందే. ఈ నేపథ్యంలో తాజాగా ఉగాది పండుగ రోజున ప్రజల కోసం చేపడుతున్న పథకాల కార్యక్రమాల వివరాలను తెలియజేస్తూ 'నవరత్నాల క్యాలెండర్'ను ముఖ్యమంత్రి విడుదల చేశారు. 2021-22 సంవత్సరానికి సంబంధించి నెలల వారీగా వార్షిక క్యాలెండర్‌ను ప్రభుత్వం రూపొందించింది.**

- ఉగాది వేడుకల్లో ఆవిష్కరించిన సిఎం జగన్
- సంక్షేమ పథకాల అమలుకు పక్కా ప్రణాళిక



### సంక్షేమ కార్యక్రమాలు ఇవీ..

ఏప్రిల్ నెలలో జగనన్న వసతి దీవెన మొదటి విడత, జగనన్న విద్యాదీవెన ఒకటవ విడత, రైతులకు వైఎస్సార్ సున్నా వడ్డీ (రబీ 2019), పొదుపు సంఘాల మహిళలకు వైఎస్సార్ సున్నా వడ్డీ చెల్లింపులు. ఇవి కాకుండా నిర్ణీతసమయంలో వైఎస్సార్ సంపూర్ణ పోషణ, జగనన్న గోరుముద్ద, రైతులకు 9 గంటల నాణ్యమైన ఉచిత విద్యుత్, డాక్టర్ వైయస్సార్ ఆరోగ్యశ్రీ, డాక్టర్ వైయస్సార్ ఆరోగ్య ఆసరా, వైయస్సార్ పెన్షన్ కానుక అమలు కార్యక్రమాలున్నాయి. అదేవిధంగా, మే నెలలో వైఎస్సార్ ఉచిత పంటల బీమా (2020 ఖరీఫ్), వైఎస్సార్ రైతు భరోసా మొదటి విడత, మత్స్యకార భరోసా (చేపలవేట నిషేధ సబ్సిడీ), మత్స్యకార భరోసా (డీజిల్ సబ్సిడీ) వగైరాలుంటాయి. ఇవి కాకుండా ప్రతి నెలలోనూ పైన పేర్కొన్న రెగ్యులర్ పథకాలు కూడా అమలులో ఉంటాయి. జూన్ నెలలో జగనన్న విద్యాకానుక, వైఎస్సార్ చేయూత, జులై నెలలో జగనన్న విద్యా దీవెన రెండవ విడత, వైఎస్సార్ వాహనమిత్ర, వైఎస్సార్ కాపు నేస్తం పథకాలు అమలు చేస్తారు. ఆగస్టు నెలలో రైతులకు వైఎస్సార్ సున్నావడ్డీ చెల్లింపులు (ఖరీఫ్ 2020), ఎంఎస్ఎంఈ స్పిన్నింగ్ మిల్లులకు ప్రోత్సాహకాలు, వైఎస్సార్ నేతన్న నేస్తం, అగ్రిగోల్డ్ బాధితులకు చెల్లింపులు ఉంటాయి. సెప్టెంబర్ నెలలో వైఎస్సార్ ఆసరా పథకం, అక్టోబర్ నెలలో రైతు భరోసా రెండవ విడత, జగనన్న చేదోడు (టైలర్లు, నాయీ బ్రాహ్మణులు, రజకులు), జగనన్న తోడు (చిరు వ్యాపారులు) పథకాలు అమలు చేస్తారు. నవంబర్ నెలలో వైఎస్సార్ ఈబీసీ నేస్తం, డిసెంబర్‌లో జగనన్న వసతి దీవెన రెండవ విడత, జగనన్న విద్యాదీవెన మూడో విడత, వైఎస్సార్ లా నేస్తం పథకాలు అమలులో ఉంటాయి. 2022వ సంవత్సరం జనవరి నెలలో వైయస్సార్ రైతు భరోసా మూడవ విడత, జగనన్న అమ్మఒడితో పాటు పెన్షన్ రూ.2,500కు పెంచడం జరుగుతుంది. ఫిబ్రవరి నెలలో జగనన్న విద్యాదీవెన నాలుగో విడత కార్యక్రమం అమలవుతుంది.

# చెంగాళమ్మ ఆలయంలో లక్ష కుంకుమార్చన

ఉగాది పండుగను పురస్కరించుకుని ఈ నెల 13న సూళ్లూరుపేటలోని శ్రీ చెంగాళమ్మ పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో లక్ష కుంకుమార్చన పూజలు ఎంతో వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా భక్తులు అమ్మవారికి నైవేద్యాలు సమర్పించుకున్నారు. ఎంతో వేడుకగా జరిగిన ఈ కార్యక్రమాన్ని తొలుత సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఆలయ అర్చకులు అమ్మవారికి శోభాయమానంగా చందనాలంకారం చేసి, ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమాలకు మాగుంట కుటుంబసభ్యులు ఉభయంకర్తలుగా వ్యవహరించారు. ఆలయ చైర్మన్ దువ్వూరు బాలచంద్రా రెడ్డి, ఈఓ ఆళ్ల శ్రీనివాసులురెడ్డి ఆలయ మర్యాదలతో వారిని సత్కరించి అమ్మవారి ప్రసాదాలను అందచేశారు.



ఎమ్మెల్యే సంజీవయ్యను సత్కరిస్తున్న ఆలయ ఇ.ఓ., చైర్మెన్



# గూడూరులో మల్లాది, జక్కంపూడి





తిరుపతి పార్లమెంటు ఉపఎన్నికల ప్రచారంలో భాగంగా ఈనెల 15వ తేదీ గురువారం గూడూరు విచ్చేసిన ఏపి బ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్మెన్, విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ శాసన సభ్యులు మల్లాది విష్ణు, రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజాలు ఏపి బ్రాహ్మణ సేవాసంఘం గౌరవాధ్యక్షుడు శ్రీకంటి రామ్మోహన్‌రావు, అధ్యక్షులు యరగుడిపాటి చలపతిరావుల నివాసాలకు వచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తిరుపతి పార్లమెంటు వైకాపా అభ్యర్థి డా. గురుమూర్తిని భారీ మెజార్టీతో గెలిపించాలని వారు బ్రాహ్మణ సంఘాల నాయకులను కోరారు. అనంతరం వారిరువురిని ఏపి బ్రాహ్మణ సంఘాల నాయకులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు ఆనిమెళ్ళ శివకుమార్, కార్యదర్శి చిట్టమూరు శ్రీనివాసరావు, డి.శ్రీనివాసరావు, చిట్టిబాబు, పవన్, శ్రావణ్‌కుమార్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# కరాటే పోటీల్లో చిన్నారుల ప్రతిభ

శ్రీలంక కరాటే ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఆన్‌లైన్ వేదికగా ఇటీవల జరిగిన అంతర్జాతీయ కరాటే పోటీల్లో నెల్లూరు కరాటే క్రీడాకారులు సత్తా చాటి బంగారు పతకం సాధించారని అసోసియేషన్ ఆఫ్ ఆర్ట్స్ కరాటే స్కూల్ రాష్ట్ర అధ్యక్షుడు మురళి ఈనెల 12న తెలిపారు. అంతర్జాతీయ కరాటే పోటీల్లో మొత్తం 200 మంది పాల్గొన్నారని, వీరిలో నెల్లూరుకు చెందిన ఎన్.ఇందుమతి, ఎన్.ప్రియ బంగారుపతకాన్ని సాధించారని పేర్కొని, విజేతలైన ఆ చిన్నారులందరినీ అభినందించారు.

# కోడ్ లేదు.. కోవిడ్ లేదు.. అంతా స్వార్ధమే

(మొదటి పేజీ తరువాయి)

ర్యాలీలు, రోడ్డు షోలు, భారీ బహిరంగ సభలు నిర్వహిస్తున్నారు. వీటికోసం లక్షలాది మంది ప్రజలను రోడ్లపైకి ఆహ్వానిస్తున్నారు. రాజకీయ సభలలో కరోనా రాదా? ఎన్నికల వేళ వీరికి కరోనా మినహాయింపు ఇచ్చిందా..??

### బాధ్యతతో వ్యవహరించిన జగన్....

తిరుపతి పార్లమెంటు ఉప ఎన్నికల ప్రచారం కోసం, దేశ స్థాయి నాయకులూ, రాష్ట్ర స్థాయి నాయకులూ రోజూ ఏదో ఒక చోట సభలు సమావేశాలు నిర్వహిస్తూనే ఉన్నారు. అన్ని పార్టీలూ ఈ ఉపఎన్నికను ప్రతిష్టాత్మకంగానే తీసుకున్నాయి. అదే తరుణంలో ఆంధ్రా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి కూడా రావడానికి కార్యక్రమం ఖరారయ్యింది. రేణిగుంట వద్ద లక్షలమందితో భారీ బహిరంగసభ నిర్వహణకు ఏర్పాట్లు కూడా మొదలయ్యాయి. అయితే కరోనా విజృంభిస్తున్న వేళ భారీ సభ శ్రేయస్కరం కాదని ఆయన తన పర్యటనను రద్దు చేసుకున్నాడు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని, ఇంటింటికీ లేఖను పంపి తన ప్రచారాన్ని నిర్వహించాడు. ప్రస్తుత తరుణంలో లక్షలాది మంది ప్రజలు ఒక చోట గుమికూడేలా చేయడం మంచిది కాదని ఆయన ప్రచారానికి రాలేదు. ఆపాటి భాధ్యత, సామాజిక స్పృహ మిగతా నాయకులకు లేకపోవడం సిగ్గుచేటు.

### షర్మిల సభకు వచ్చే కరోనా.. కెసిఆర్ సభకు రాదా...?

వైయస్ షర్మిల తెలంగాణ రాష్ట్రంలోని ఖమ్మంలో ఏప్రిల్ 9వతేదీ సంకల్ప సభ పెట్టింది. ఈ సభలో కేవలం 6వేల మంది మాత్రమే పాల్గొనేలా తెలంగాణ ప్రభుత్వం ఆంక్షలు విధించింది. రాష్ట్రంలో కరోనా కేసులు పెరుగుతున్న వేళ ఎక్కువ మందికి అనుమతి ఇవ్వలేమని చెప్పేసింది. మరి అదే ప్రభుత్వ ముఖ్యమంత్రి చంద్రశేఖర రావు 14వతేదీ నాగార్జునసాగర్ ఉప ఎన్నిక కోసం లక్షమందితో భారీ బహిరంగ సభను నిర్వహించాడు. తనదైన తరహాలో అన్ని ప్రతిపక్ష పార్టీలని ఉతికి ఆరేశాడు. ఇక్కడ ఆయన కరోనాని మాత్రం విస్మరించాడు. షర్మిల సభకు వచ్చే కరోనా తన సభకు ఎందుకు రాదనే లాజిక్కును మర్చిపోయాడు.

### ప్రజల ఆరోగ్యం కోసం పార్టీలు కలవలేవా...?

నిజంగా ఈ నాయకులకు ప్రజల సంక్షేమమే ముఖ్యమైతే ఇలాంటి తరుణంలో వీరంతా ఒక్కటి కాలేరా...? రోజుకి వందల ప్రాణాలను కరోనా మహమ్మారి పొట్టన పెట్టుకుంటున్న తరుణంలో ప్రచారసభలని నిషేధించుకోలేరా...?? అన్ని పార్టీలు సమావేశమై ఒక్కతాటిపై నిలిచి, ఎవరూ ప్రచారానికి వెళ్లొద్దు... తీర్పును ఓటర్ల విచక్షణకే వదిలేద్దాం అని తీర్మానించుకోలేరా..??? చెయ్యగలరు, కానీ చెయ్యరు.

తమ శక్తి మేరకు ప్రజలను కొనెయ్యాలి, తాయిలాలతో మభ్య పెట్టాలి, ఇందుకోసం నేరుగా వారిని కలవాలి. ఓటర్లు కూడా తక్కువ తినలేదు, ఇలాంటి అవకాశాలు అప్పుడప్పుడే వస్తాయన్నది వారి భావన. అందుకే దొరికినప్పుడే అందినవరకు దోచేసుకుందాం అన్నది వారి ఆలోచన. ఈ క్రమంలో ఎవరూ తమ ప్రాణాల గురించి ఆలోచించడంలేదు, రాబోయే ప్రమాదాన్ని గమనించుకోవడంలేదు, జరగబోయే అనర్ధాన్ని గుర్తించడంలేదు. ఎవరో చెప్పినట్లుగా ఇది కలియుగమే కాదు, కలుషిత యుగం కూడా...! ఎవరి స్వార్ధం వారిది.

*స్వార్ధస్వామ్యమా వర్ధిల్లు. ..!!*

# పాఠశాలల్లో కరోనా కలవరం

## బడులకు వెళ్ళాలంటే భయపడుతున్న వైనం

జిల్లాలో కరోన సెకండ్‌వేవ్ ఉధృతంగా ఉండడంతో ఎక్కడ చూసినా కరోనా కేసులు కలవరం పుట్టిస్తున్నాయి. పలుచోట్ల పాఠశాల విద్యార్థులు కూడా కరోనా బారిన పడుతుండడంతో ఆ పాఠశాలలు మూతపడుతున్నాయి. రాపూరు మండలంలోని వేపినాపి గ్రామంలో పదిమంది విద్యార్థినులకు కరోనా సోకినట్లు నిర్ధారణ కావడంతో ఈనెల 12 నుంచి ఆ పాఠశాలను మూసివేస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారులు ప్రకటించారు. ఉదయగిరికి చెందిన ఓ ఉపాధ్యాయుడు కరోనాతో ఈనెల 14న మరణించడంతో ఆయన పనిచేస్తున్న వరికుంటపాడు మండలంలోని పాఠశాల విద్యార్థుల పరిస్థితి అయోమయంగా మారింది. అదేవిధంగా బాలాయపల్లి మండలంలోని జయంపు గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న ఒక ఉపాధ్యాయుడికి కరోనా సోకడంతో విద్యార్థులు ఆ బడికి పోవాలంటేనే భయపడుతున్నారు. మండల కేంద్రమైన మనుబోలు కోదండరామపురం మెయిన్ పాఠశాలలో ఒక ఉపాధ్యాయురాలికి కరోనా నిర్ధారణ కావడంతో ఆమె పాఠశాలకు రావడం మానేసి హోం క్వారంటైన్‌లో ఉందని, తమ పిల్లలను ఆ బడికి పంపాలంటే ఆందోళనగా ఉందని తల్లిదండ్రులు చెప్తున్నారు. మనుబోలు ప్రభుత్వ హైస్కూలు హెచ్ఎంకు కరోనా పాజిటివ్ రావడంతో ఆ పాఠశాలను కూడా మూసివేశారు. ఇలా పలు పాఠశాలల్లో కూడా కరోనా మహమ్మారి వ్యాధి విజృంభిస్తూ అందరినీ బెంబేలెత్తిస్తోంది.

# మూలస్థానేశ్వరునికి రుద్రాభిషేకం

ఉగాది పండుగను పురస్కరించుకుని ఈనెల 13న నెల్లూరు, మూలాపేటలో కొలువైవున్న భువనేశ్వరిదేవి సమేత శ్రీ మూలస్థానేశ్వరస్వామి ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. భువనేశ్వరిదేవి అమ్మవారిని శాకంబరి అలంకారంతో శోభాయమానం చేశారు. ఆలయంలో పెద్దఎత్తున మహన్యాసపూర్వక రుద్రాభిషేకంతో పాటు కల్యాణోత్సవం, పుష్పయాగం ఎంతో నేత్రపర్వంగా చేపట్టారు. అనంతరం పేట ఉత్సవం జరిపారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని స్వామివార్లను దర్శించుకున్నారు.

వీక్షణం - మంజీరాజ్జి

# ప్రజాస్వామ్యమా! నువ్వెక్కడ?

'ఒక దేశానికి నియంత యొక్క నియంతృత్వాధికారం కారణంగా ఎదురయ్యే ప్రమాదం కంటే... ప్రజాస్వామ్య దేశంలో ప్రజాస్వామ్యం పట్ల సామాన్యుడి నిర్లిప్తత, నిరాసక్తత ఎక్కువ ప్రమాదానికి దారి తీస్తుంది' ప్రజాస్వామ్యం కోసం పరితపించిన రాజనీతిజ్ఞులు చేసిన హెచ్చరిక ఇది. ప్రజాస్వామ్యం పట్ల పౌరుడు నిత్య చైతన్యంతో ఉండాలనే సూచన ఇది. డెబ్బై ఏళ్లు దాటిన ప్రజాస్వామ్యం మనది. స్వతంత్ర భారతంలో ఈ హెచ్చరికను గుర్తుచేసుకోవాల్సిన అవసరం అత్యవసరంగా వచ్చింది. ఆ అవసరాన్ని తెచ్చిన ఎన్నికలను ఇటీవలనే చూశాం. రాష్ట్రంలో జరిగిన ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలే అవి.

## ఇలా ఉండేది!

ఉదయం ఎనిమిది గంటలకు పోలింగ్ మొదలయ్యే సమయానికి పోలింగ్ బూత్‌ల ఎదుట ఓటర్లు బారులు తీరి నిలబడిన ఎన్నికలను చూశాం. వార్ధక్యంతో శక్తి ఉడిగిపోయిన వృద్ధురాలు నడవలేక కర్ర ఊతంతోనో మనుమడి సహాయంతోనో పోలింగ్ బూత్‌కి రావడాన్నీ చూశాం. మూడు చక్రాల సైకిల్ మీద పోలింగ్ బూత్‌కి వచ్చి, సైకిల్ దిగి నేల మీద పాక్కుంటూ బూత్‌లోకి వెళ్లి ఓటేసిన ఓటరును కూడా చూశాం. ఈ ఫొటోలన్నింటినీ వరుసగా ప్రచురించి 'ప్రజాస్వామ్య స్ఫూర్తి, ఓటు విలువను గుర్తించిన ఓటర్లు' అనే మకుటంతో ప్రజాస్వామ్యాన్నీ, ఓటర్లనూ గౌరవిస్తూ రాసిన వార్తాకథనాలను చూశాం. ఏప్రిల్ ఎనిమిదవ తేదీన జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల పోలింగ్ రోజు అందరిలో ఒకటే ప్రశ్న. ఓటర్లలో 'ఆ స్ఫూర్తి నేడు ఏమయింది'?

## ఆ రోజు ఏమైంది?

ఉదయం ఏడు గంటలు. పోలింగ్ బూత్‌ల దగ్గర పోలింగ్ సిబ్బంది తప్ప జనం కనిపించలేదు. మరో గంటకు నాయకులు వచ్చారు. ఓటేశారు, 'బూత్ ఖాళీగా ఉంది, నేను వస్తున్నాను రెడీగా ఉండండి' అని ఇంటికి ఫోన్‌లు చేశారు. మరో అరగంటలో మాయమైపోయి కుటుంబాలతో వచ్చారు. వాళ్లూ ఓటేశారు. క్యూలో కాదు కదా, కనుచూపు మేరలో సామాన్య ఓటర్లు కనిపించడం లేదు. వంద మీటర్ల దూరం 144 సెక్షన్ అంటూ అదిలించడానికి పోలీసులు సిద్ధంగానే ఉన్నారు. కానీ అదిలింపచేసుకోవడానికి మనిషి అనే ప్రాణి కరవయ్యాడు. ఏ పనీ లేకుండా రోజూ ఊరి సెంటర్‌లో తచ్చాడే వాళ్లు కూడా ఆ రోజు పలచబడ్డారు. పోటీలో ఉన్న పార్టీలన్నీ షామియానాలు వేసి ఓటరు స్లిప్పులు రాసివ్వడానికి కార్యకర్తలతో సిద్ధమయ్యాయి. స్లిప్పు రాయించుకోవడానికి ఎప్పుడూ వచ్చే ఓటరు ఆ రోజు ఎక్కడికి వెళ్లాడో!!

## ఊరూరా ఇదే తీరు

ఒక ఊరయితే... గ్రామ సమస్యలు తీర్చని నాయకుల మీద కినుక వహించి గ్రామస్థులంతా ఎన్నికలను బహిష్కరించారనుకోవచ్చు. ఏ ఒక్క ఊరో కాదు, దాదాపుగా ప్రతి ఊరిదీ ఇదే తీరు. సమాచారం వేగవంతమైన కాలం ఇది. టీవీ చానెళ్లు చిన్నవి పెద్దవి కలిపి పదుల సంఖ్యలో ఉన్నాయి. చేతిలోని స్మార్ట్‌ఫోన్ సామాన్యుడిని కూడా జర్నలిస్టును చేసేసింది. 'ఫలానా గ్రామంలో ఇదీ పరిస్థితి' అంటూ వీడియోలు గంటలోనే రాష్ట్రమంతా చుట్టేశాయి. ఇంతకీ ఓటర్లలో నైరాశ్యం ఎందుకు? తమ పాలకులను ఎన్నుకోవడం పట్ల నిర్లిప్తత ఎందుకు? 'సీఎంగా జగన్మోహన్ రెడ్డిని గెలిపించుకున్నాం. అన్ని సౌకర్యాలూ మా ఇంటి ముందుకే వస్తున్నాయి. ఇక మళ్లీ ఓట్లేయడం ఎందుకు?' అనుకున్నారా! మనకు ఇన్ని సౌకర్యాలు కల్పించిన జగన్మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలియచేయడం కోసమైనా వచ్చి ఓటేయాలి కదా! పార్టీ గుర్తు లేని పంచాయితీ సర్పంచ్ ఎన్నికల్లో ఓటేసి మద్దతు ప్రకటించేశాం చాలనుకున్నారా? ఈ ప్రశ్నావళిని ఏ గ్రామంలో ఏ పార్టీ కార్యకర్త ముందు పెట్టినా వచ్చే సమాధానం ఒక్కటే. 'ఓటుకు డబ్బిచ్చి ఇంటి ముందు వాహనం పెడితే పొద్దున్నే వచ్చి ఓటేసే వాళ్లు. ఈసారి ఏ పార్టీ కూడా ఆ పని చేయకపోవడంతో ఎంత అడిగినా ఓటుకు రావడం లేదు' అనే సమాధానమే వస్తోంది.

## ఓటరా నోటరా!

ఓటర్ల దగ్గరకు వెళ్లి దణ్ణం పెట్టి 'మా పార్టీకి ఓటేయండి' అని అడిగినప్పుడు 'మీరు గెలిస్తే మాకేం చేస్తారు' అని అడగడం మానేశారు. 'మీకు ఓటేయాలంటే మాకేమిస్తారు' అని అడుగుతున్నారు. ఈ పాపం ఎవరిది? ఇందులో తిలా పాపం తలా పిడికెడు అని అందరూ ఒప్పుకోవాల్సిందే. ఎన్నికలు నిజాయితీగా సాగుతున్న రోజుల్లో ఎక్కడో ఒక చోట ఎవరో ఒక నాయకుడు 'ఏదో ఒకటి ఇచ్చి' ప్రలోభానికి గురి చేసేవాడు. క్రమంగా ఈ విష సంస్కృతి విస్తరించి పోయింది. ఓటు వేయడం తమ బాధ్యత అనుకోవడం మానేసి 'ఏమీ ఇవ్వకపోతే ఎందుకు ఓటేయాలి' అని భీష్మించుకునే స్థితికి నైతికత నేలబారిపోయింది. సామాన్యుడి మనసుల్లో కరడు కట్టుకుపోయి ఉన్న ఈ భావన గడచిన ఎన్నికల్లో బయటపడిందంతే. ప్రధాన పార్టీ అస్త్ర సన్యాసం చేయడంతో గ్రామాల్లో పోటాపోటీగా డబ్బులు పంచే చీకటి వేడుక వేగం తగ్గిపోయింది. 'అవతలి వాళ్లు డబ్బు ఇవ్వనప్పుడు మనమూ ఎందుకివ్వాలి?'... ఇది మరో వర్గం ధీమా. ఫలితం పోలింగ్ బూత్ వెలవెల. ఈ సంగతి తెలిసిన వెంటనే స్థానిక ఎమ్మెల్యేలు, సమన్వయకర్తలు రంగంలోకి క్షేత్రస్థాయి నాయకులను పరుగులు పెట్టించడం, కార్యకర్తలు ఓటర్ల ఇళ్లకు వెళ్లి బతిమిలాడడంతో మొత్తానికి ఓటరు మహానుభావుడు ఇష్టంగానో అయిష్టంగానో పోలింగ్ శాతాన్ని యాభై శాతం దాటించి ప్రజాస్వామ్యం పరువు నిలబెట్టాడు. ఈ ఎన్నికలను చూశాక ప్రజాస్వామ్యానికి ఏమని భాష్యం చెప్పుకోవాలి?

ప్రజాస్వామ్యాన్ని మొదటగా మనం గుర్తు చేసుకున్న రాజనీతిజ్ఞుల సూక్తి కళ్లద్దాల నుంచి చూడాలా? లేక ఇటలీ మాజీ ప్రధానమంత్రి, ఫాసిస్టు పార్టీ నాయకుడు ముస్సోలిని అన్నట్లు 'శాంతి, ప్రజాస్వామ్యం అనేవి పిచ్చివాళ్ల కలలు' అని సరిపెట్టుకోవాలా?!

# ఆలూరుకు సన్మానం

ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని ఈ నెల 13వతేదీ ప్రముఖ వేద పండితుడు ఆలూరు శిరోమణి శర్మను నెల్లూరు బి.వి.నగర్‌లోని షిరిడి సాయిబాబా మందిర నిర్వాహకులు, భక్త సేవాదళ్ సభ్యులు సన్మానించారు. మనోహర్, సంపత్‌కుమార్, సుబ్బారావు, రమేష్, శ్రీనివాసమూర్తి తదితరులు పాల్గొన్నారు.



# డా. అంబేద్కర్ సేవలు చిరస్మరణీయం

○ ఘనంగా జయంతి వేడుకలు

భారత రాజ్యాంగ నిర్మాత, బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ సేవలు చిరస్మరణీయమని, ఆ మహాశయుని అడుగుజాడల్లో అందరూ నడవాలని ఆకాంక్షిస్తూ జిల్లావ్యాప్తంగా వాడవాడలా అంబేద్కర్ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. శ్రీహరికోటలోని షార్ కేంద్రంలో ఉన్న బ్రహ్మప్రకాష్‌హాల్‌లో జరిగిన కార్యక్రమంలో షార్ డైరెక్టర్ ఆర్ముగం రాజరాజన్, షార్ కంట్రోలర్ శ్రీనివాసులురెడ్డి, అసోసియేట్ డైరెక్టర్ ఎంబీఎన్ మూర్తి, డిప్యూటీ డైరెక్టర్లు ఆర్.వెంకటరామన్, ఎ.ప్రసాదరావులతో పాటు కార్యనిర్వహణ కమిటీ ఛైర్మన్ జి.రమేష్‌బాబు తదితరులతో పాటు షార్‌లోని ఎస్సీఎస్టీ సంక్షేమసంఘం నాయకులు పాల్గొని డా.బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అదేవిధంగా నెల్లూరు నగరంలోని విఆర్‌సి సెంటర్ వద్ద ఉన్న డా. అంబేద్కర్ విగ్రహానికి అనేకమంది నాయకులు, అధికారులు, పలు సంస్థలు, పార్టీల వారు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

## మహోన్నత వ్యక్తి.. డా.బిఆర్ అంబేద్కర్

భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ దేశానికి చేసిన సేవలు చిరస్మరణీయమని జిల్లా కలెక్టర్ చక్రధర్‌బాబు అన్నారు. ఈనెల 14న ఆయన నగరంలోని కలెక్టరేట్ ప్రాంగణంలో ఉన్న తిక్కనభవన్‌లో అంబేద్కర్ జయంతి వేడుకల సభలో మాట్లాడారు. రాజ్యాంగం ద్వారా సమసమాజస్థాపనకు మార్గం వేసిన మహోన్నత వ్యక్తి డాక్టర్ బిఆర్ అంబేద్కర్ అని ఆయన కొనియాడారు తొలుత అంబేద్కర్ చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. జేసీలు హరేందిరప్రసాద్, ప్రభాకర్‌రెడ్డి, డిఆర్‌ఓ ఓబులేసు పాల్గొన్నారు.

# సిబిఎస్ఇ టెన్త్ పరీక్షలు రద్దు

○ 12వ తరగతి పరీక్షలు వాయిదా

దేశవ్యాప్తంగా కరోనా విలయతాండవం చేస్తున్న నేపథ్యంలో వచ్చే నెల 4వ తేది నుంచి జరగాల్సివున్న సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సిబిఎస్ఇ) 10వ తరగతి పరీక్షలను రద్దుచేయడంతో పాటు, 12వ తరగతి పరీక్షలను కూడా వాయిదా వేస్తున్నట్లు ఈనెల 14న కేంద్ర విద్యాశాఖ ప్రకటించింది. ప్రధాని నరేంద్రమోడీతో పాటు విద్యాశాఖ ఉన్నతాధికారులు ఉన్నతస్థాయి సమావేశంలో చర్చించిన అనంతరం విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని ఈ నిర్ణయం తీసుకున్నారు. జూన్ 1వ తేదిన పరిస్థితిని సమీక్షించి కొత్త షెడ్యూల్ విడుదల చేసే అవకాశాలను పరిశీలించాలని కేంద్రం భావిస్తున్నట్లు సమాచారం.


## శ్రద్ధాంజలి




### బత్తుల సాయి సత్యనారాయణ

అడ్వర్టైజ్‌మెంట్ మేనేజర్, కళానికేతన్ సిల్క్స్ ప్రై.లి., విజయవాడ.

సాయన్నా...

కళానికేతన్‌లో
కళాత్మకమైన మీ ఆలోచనలు
సృజనాత్మకమైన మీ సేవా సౌరభాలు
ఇక కానరావంటే నమ్మలేకున్నాం.

మీ ఆత్మశాంతికై ప్రార్థిస్తూ...

- సిబ్బంది
వి.ఆర్.కె. సిల్క్స్
డా. బెజవాడ గోపాలరెడ్డి సర్కిల్, మినీ బైపాస్‌రోడ్డు, నెల్లూరు.

# మొన్న లాయర్ రాసిందే..
# ఇప్పుడు కోర్టు చెప్పింది




- **'ఉచిత' పథకాలపై మద్రాసు హైకోర్టు ఆగ్రహం..**
- **విమర్శలపాలవుతున్న రాజకీయ పార్టీల 'ఆల్ ఫ్రీ' హామీలు**

*గత వారం 'లాయర్'(09.04.21) సంచిక ప్రధాన శీర్షిక 'పడకేస్తున్న ప్రజాస్వామ్యం' అనే వార్తలో ఇప్పటి రాజకీయాలను విశ్లేషిస్తూ.. ఉచిత తాయిలాలతో ఓట్లకు గాలం వేయడం, అధికారం కోసం అడ్డదారులు తొక్కడం వగైరాలతో రాజకీయం నిబద్ధత కోల్పోయిందని, ప్రజాస్వామ్యం పడకేస్తోందని చెప్పినట్లుగానే ఇప్పుడు మద్రాసు హైకోర్టు కూడా అదే తీరులో రాజకీయపార్టీలు అనుసరిస్తున్న వైఖరిని తూర్పారబట్టింది. ఉచిత తాయిలాల హామీలపై పార్టీల అనుచిత తీరును దుయ్యబట్టింది.*

ఎన్నికల ప్రచారాలు మారుమోగుతున్న నేపథ్యంలో పలు పార్టీల నాయకులు తమ ఇష్టం వచ్చినరీతిగా హామీలు గుప్పిస్తున్నారు. ఆ హామీలు ఎంతవరకు నెరవేరుస్తారో తెలియదు కానీ, వారి మాటల హామీలు ఈ ఎన్నికల్లో ఓటర్లను బాగా ప్రభావితం చేస్తాయని కూడా అంటున్నారు. ముఖ్యంగా తమిళనాడులో ఈ హామీలు మరింత జోరుగా వినిపిస్తున్నాయి.

'మా పార్టీని గెలిపిస్తే ఇంటికో వాషింగ్‌మెషీన్.! నన్ను గెలిపిస్తే మహిళలకు ఉచితంగా బంగారం ఇస్తాం..! మా అభ్యర్థిని గెలిపిస్తే ప్రతి ఇంటికీ నెలకు రూ. 10 వేలు.!..' ఇలా ఎన్నికల్లో ఇలాంటి 'ఉచిత' హామీలు ఎక్కువయ్యాయి.

ఉచిత టీవీ, ఉచిత ఏసీ, ఉచిత సైకిల్, ఉచిత బైక్, మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం, ఉచిత కేబుల్ కనెక్షన్.. ఇలా ఒక్కటా రెండా.. అన్నీ ఉచితంగానే ఇచ్చేస్తామంటూ ప్రకటిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈ ఉచిత హామీలపై మద్రాస్ హైకోర్టు మండిపడింది. ఉచిత పథకాలతో ప్రజలను బద్ధకస్తులుగా మారుస్తున్నారంటూ అసంతృప్తి వ్యక్తం చేసింది. తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో ప్రధాన పార్టీ ప్రకటించిన ఉచిత హామీలకు వ్యతిరేకంగా హైకోర్టులో ఇటీవల పిటిషన్ దాఖలయింది. ఉద్యోగాలు, మౌలిక సదుపాయాల కల్పన, విద్యా వైద్యారంగ అభివృద్ధి, రవాణా, వ్యవసాయ రంగాలను పక్కన బెట్టి.. ఉచిత హామీలపైనే అభ్యర్థులు దృష్టి పెడుతున్నారని పిటిషనర్ వాదించారు. వీటికి కళ్లెం వేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నాడు. దానిపై విచారించిన హైకోర్టు ధర్మాసనం..ఈ ఉచిత పథకాల హామీలను తప్పుబట్టింది. ఉచిత పథకాల వల్ల ప్రజలంతా సోమరిపోతులుగా మారుతున్నారని కూడా అభిప్రాయపడింది. ఒక్కో నియోజకవర్గంలో అభ్యర్థులు ఈ ఎన్నికల ప్రచారాలకు భారీగా ఖర్చుపెడుతున్నట్లు తెలుస్తోందని, ప్రజలు ప్రలోభాలకు గురైతే, మీ నాయకుడిని ప్రశ్నించే నైతిక హక్కు మీకు ఎక్కడుంటుందని ప్రశ్నించింది. ప్రజాస్వామ్యంలో తమకు నచ్చిన నాయ కుడిని ఎన్నుకునే స్వేచ్ఛ ప్రజలకుందని స్పష్టం చేసింది.

## 'ఉచిత' హామీలు.. సముచితం కాదు

తమిళనాడు ఎన్నికల ప్రచారంలో ఉచిత కలర్ టీవీలు, ఫ్యాన్స్, మిక్సర్ గ్రైండర్లు, ల్యాప్‌టాప్‌లు.. వంటి హామీలు ఎక్కువగా వినిపిస్తున్నాయి. ఒక పార్టీ ఉచిత వాషింగ్ మెషీన్ హామీ కూడా ఇచ్చేసింది. పలు ప్రధాన పార్టీలు మహిళలకు రేషన్ కోసం ఆర్థిక సాయం చేస్తామని కూడా ప్రకటించాయి. ఐతే ఈ ఉచిత హామీల సంప్రదాయం కొనసాగడం ప్రజలకు ఎంత మాత్రం మంచిది కాదని హైకోర్టు అభిప్రాయపడింది. రానున్న రోజుల్లో అన్నం కూడా వండి తినిపిస్తారేమోనని కోర్టు సెటైర్లు వేసింది. 'ఉచిత' హామీలను అవినీతి వ్యవహారంగా పరిగణించాల్సిన అవసరం కూడా ఉందని.. వీటి వలన ఓటర్లు ప్రభావితమవుతున్నారని అభిప్రాయపడింది. ఉచిత పథకాల వలన ప్రజలు బద్ధకస్తులుగా మారిపోయారని.. అందుకే హోటళ్లు, సెలూన్‌లు, చివరకు పొలాల్లో పనిచేసేందుకు కూడా ఇతర రాష్ట్రాల నుంచి కూలీలను రప్పించుకోవాల్సిన పరిస్థితి నెలకొందని పేర్కొంది. ఉచిత పథకాలకు సంబంధించి పిటిషనర్ పేర్కొన్న 20 ప్రశ్నలకు కేంద్ర, ఎన్నికల సంఘం సమాధానం చెప్పాలని హైకోర్టు ఆదేశించింది. ఉచిత హామీలకు అడ్డుకట్ట వేసే దిశగా ఎలాంటి చర్యలు చేపడతారో ఏప్రిల్ 26లోగా చెప్పాలని హైకోర్టు స్పష్టం చేసింది. ఏదైమైనా ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజలను ఇలా ప్రలోభపెట్టడం, అన్నింటినీ ఉచితంగానే ఇచ్చేస్తామంటూ ప్రజలను నాయకులు బద్ధకస్తులుగా మార్చే ఇలాంటి హామీల పట్ల, రాజకీయపార్టీల అనుచిత వైఖరి పట్ల సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.







Edited, Published, Printed & Owned by THUNGA SIVAPRABHATH REDDY, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at Roopa Graphics, Magunta Layout, NELLORE-3.
Cell: 9866314741. Editor-THUNGA SIVAPRABHATH REDDY, Managing Editor : T.BHARATHI REDDY, Sub-Editor : MADDURU SRINIVASULU. e-mail: lawyerpatrika@gmail.com